
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 21 జనవరి 2025



లంకె బిందెల పేరుతో బురిడీ

- పూజల పేరిట రూ.28 లక్షల వసూలు
- దొంగ బాబా టోకరా
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ఏడుగురు నిందితులు అరెస్టు

... మెయిన్‌లో



యోగేంద్రబాబా అలియాస్ పైడిపాటి వెంకటభార్గవ్ రాఘవ

వైసీపీ నేతల మాస్టర్‌ప్లాన్‌కు చెక్

గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్-2041పై విచారణ

ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

- డ్రాఫ్టనకు, ఫైనల్ మాస్టర్‌ప్లాన్‌కు చాలా వ్యత్యాసాలు ఉన్నాయని గుర్తింపు
- త్వరలో అభ్యంతరాల స్వీకారం
- నాటి పాలక పార్టీ పెద్దల భూములకు విలువ పెరిగేలా ఇష్టారాజ్యంగా ప్రతిపాదనలు



సముద్ర తీరంలో చేపట్టాల్సిన కోస్టల్ కారిడార్‌ను దారి మళ్లించిన దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మహా నగర పాలక సంస్థ (వీఎంఆర్‌డీఏ) అమలుచేస్తున్న మాస్టర్ ప్లాన్-2041పై పూర్తిస్థాయి విచారణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీచేసింది. వీఎంఆర్‌డీఏ సమర్పించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు, ఖరారు చేసిన ఫైనల్ మాస్టర్‌ప్లాన్‌కు చాలా వ్యత్యాసాలు ఉన్నాయని, దానికి బాధ్యులు ఎవరో గుర్తించి, తెలియజేయాలని ఆదేశించింది.

వీఎంఆర్‌డీఏ-2041 మాస్టర్ ప్లాన్‌పై మొదటి నుంచి అనేక ఆరోపణలు, విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దానిని తయారుచేశారు. ఆ పార్టీలో అత్యధిక శాతం నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు కావడంతో వారికి నచ్చినట్టుగా ఏర్పాట్లు చేసుకున్నారు. అధికారులు ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ రహదారులను మార్చేశారు. వారికి పెద్ద సంఖ్యలో భూములున్న వైపు మాస్టర్ ప్లాన్ రహదారులను మళ్లించేసి, విలువ పెంచుకున్నారు. ఈ క్రమంలో సామాన్య రైతులు నష్టపోయారు. అప్పటికే వుడా/వీఎంఆర్‌డీఏ అనుమతితో వేసిన లేఅవుట్ల మధ్య నుంచి కూడా రహదారులు ప్రతిపాదించారు. డెవలపర్లు/కొనుగోలుదారులు లబోదిబోమన్నా సరే పట్టించుకోలేదు.

వైసీపీలో కీలక నాయకుడి కోసం విశాఖ నుంచి భీమిలి మీదుగా భోగాపురం వరకూ ప్రతిపాదించిన కోస్టల్ కారిడార్‌ను నేరెళ్లవలస వద్ద దారిమళ్లించారు. తీర ప్రాంతం పక్క నుంచి వెళ్లాల్సిన ఈ మార్గాన్ని కొండలు, గుట్టలు ఎక్కించి మూలకుద్దు వద్ద మళ్లీ తీరానికి చేర్చారు. ఇక విశాఖపట్నం నగరం విషయానికి వస్తే అప్పటికే దసపల్లా భూములపై కన్నేసి, హస్తగతం చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్న వైసీపీ నేతలు...అక్కడ 40 అడుగుల రహదారి ఉండగా దానిని 80 అడుగులకు విస్తరించాలని మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించారు. ఆ తరువాత ఇంకేవో లెక్కలు వేసుకొని దానికి 100 అడుగులకు పెంచారు. సాధారణంగా ఏ రహదారినైనా విస్తరిస్తే అటు,ఇటు సమానంగా విస్తరిస్తారు. కానీ ఇక్కడ ఓ వైపు యుఎల్‌సీ కింగ్‌కు చెందిన భవనం ఉండడంతో, రహదారిని రెండు వైపులా విస్తరిస్తే ఆ భవనానికి నష్టం కలుగుతుందని, కేవలం ఒక వైపే ఇక్కడి మార్గాన్ని విస్తరించే ప్రయత్నం చేశారు. అలాగే సిరిపురం జంక్షన్ నుంచి సంపత్ వినాయకుడి ఆలయం మీదుగా ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని 200 అడుగులకు విస్తరించాలని ప్రతిపాదించారు. ఇది అసంబద్ధమని, చాలా మంది అభ్యంతరాలు వ్యక్తంచేసినా పట్టించుకోలేదు. ఆ మార్గంలో భారీ అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టిన వైసీపీ నేత ఈ మాస్టర్‌ప్లాన్‌ను అడ్డం పెట్టుకొని రూ.50 కోట్లకు పైగా విలువైన టీడీఆర్‌ని జీవీఎంసీ నుంచి తీసుకున్నారు.

అలాగే దాకమర్రిలో వైసీపీ నేత లేఅవుట్‌కు ఇబ్బంది లేకుండా దారిమళ్లించారు. కొన్నిచోట్ల భూ యజమానులతో ముందస్తు ఒప్పందాలు చేసుకొని రెసిడెన్షియల్ ప్రాంతాలను కమర్షియల్ ప్రాంతాలుగా మార్చేశారు. పరిశ్రమలకు కేటాయించిన ప్రాంతాలను కూడా రెసిడెన్షియల్‌గా చూపించారు. ఉదాహరణకు సీతమ్మధారలోని ... మిగతా 6వ పేజీలో

త్వరలో ఎమ్మెల్యేలతో సమావేశం

- ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ



ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌పై అభ్యంతరాలు తీసుకొని వాటిని పరిశీలించి, సవరణలు చేయాల్సిందిగా ఆదేశించింది. దీనిపై ముందుగా వీఎంఆర్‌డీఏ పరిధిలోని ఎమ్మెల్యేలు అందరితో ఒక సమావేశం నిర్వహించి, తగు సూచనలు, సలహాలు తీసుకుంటాం. ఆ తరువాత నోటిఫికేషన్ ఇచ్చి అభ్యంతరాలు స్వీకరిస్తాం.

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బదిలీ

- మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా పోస్టింగ్
- నగర కమిషనర్‌గా ఇంకా ఎవరినీ నియమించని ప్రభుత్వం


సంపత్‌కుమార్

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):

గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్ పి.సంపత్‌కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సీడీఎంఏ)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 25 మంది ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది.

2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంపత్‌కుమార్ గత ఏడాది జూలై 20న జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. వివాద రహిత అధికారిగా సంపత్‌కుమార్ గుర్తింపుపొందారు. నగరంలో వీధి దీపాల సమస్య పరిష్కారంతోపాటు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో అవినీతి జరగకుండా చర్యలు చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా కార్యాచరణ రూపొందించారు. అయితే ఆరు నెలలు కూడా పూర్తికాకుండానే సంపత్‌కుమార్‌ను బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. సంపత్‌కుమార్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

రైళ్లకు మహా కుంభమేళా తాకిడి



- భారీగా తరలివెళుతున్న జిల్లావాసులు
- విశాఖ-బనారస్ ఎక్స్‌ప్రెస్ మార్చి 19 వరకూ ఫుల్
- ప్రత్యేక రైళ్లలోనూ అయిపోయిన బెర్తులు
- భువనేశ్వర్, పూరి వెళ్లి...అక్కడ నుంచి ప్రయోగ్ రాజ్ వెళ్లేందుకు భక్తుల ఏర్పాట్లు



విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు జిల్లా వాసులు భారీగా తరలివెళుతున్నారు. దీంతో శాశ్వత ప్రాతిపదికన నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లు, కుంభమేళా కోసం అధికారులు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్లకు ఊహించని డిమాండ్ ఏర్పడింది. ప్రయాగ్‌రాజ్‌కు సమీపంలోని గోరఖ్‌పూర్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్లకు వెళ్లే రైళ్లు రద్దీగా ఉంటున్నాయి.

బనారస్ ఎక్స్‌ప్రెస్‌కు బెర్తులు ఫుల్

మహా కుంభమేళా నేపథ్యంలో విశాఖ నుంచి బనారస్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలుకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. ప్రతి ఆది, బుధవారాలు (బైవీక్లీ) అందుబాటులో ఉండే ఈ ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 19 వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి. కొన్ని తేదీల్లో కేవలం నాలుగైదు ఫస్ట్ ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి. వారణాసి సమీపంలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్‌లో ఈ రైలుకు హాల్ట్ ఉండడంతో కుంభమేళా స్నానాలకు వెళ్లే భక్తులు బనారస్ ఎక్స్‌ప్రెస్‌ను ఆశ్రయిస్తున్నారు.

ప్రత్యేక రైళ్లకు డిమాండ్

మహా కుంభమేళా భక్తుల సౌకర్యార్థం అధికారులు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్లలో కూడా బెర్తులు అయిపోయాయి. విశాఖ-గోరఖ్‌పూర్ (08562), విశాఖ-దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఎక్స్‌ప్రెస్ (08530), దువ్వాడ మీదుగా నడుస్తున్న నర్సాపూర్-బనారస్ (07109), తిరుపతి-బనారస్ ఎక్స్‌ప్రెస్ (07107) రైళ్లలో బెర్తులు నిండిపోయాయి. విశాఖ-గోరఖ్‌పూర్ మధ్య ఫిబ్రవరి 16 వరకూ ప్రతి ఆదివారం అందుబాటులో ఉండేలా ప్రవేశపెట్టిన 08562 నంబరు గల రైలులో బెర్తులు అయిపోయి, 154 వరకు నిరీక్షణ జాబితా ఏర్పడింది. విశాఖ-దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్ మధ్య ఫిబ్రవరి 27 వరకూ ప్రతి గురువారం అందుబాటులో ఉండే విధంగా నడుపుతున్న 08530 నంబరు గల ప్రత్యేక రైలులో వచ్చే నెల 6, 20 తేదీల్లో బెర్తులు నిండిపోగా, 27న మాత్రం ప్రస్తుతానికి ఖాళీలు ఉన్నాయి. అదేవిధంగా దువ్వాడ మీదుగా ప్రతి ఆదివారం నర్సాపూర్ నుంచి బనారస్ వెళ్లే 07109 నంబరు గల ప్రత్యేక రైలులో ఫిబ్రవరి 2 వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా నెలకొంది. అలాగే దువ్వాడ మీదుగా ప్రతి ఆదివారం అందుబాటులో ఉన్న తిరుపతి-బనారస్ ప్రత్యేక రైలు

... మిగతా 6వ పేజీలో

నేడు బీజేపీ జిల్లా అధ్యక్షుడి ప్రకటన

- పోటీలో నలుగురు... పరశురామరాజు, విజయానంద్‌రెడ్డి, కరణం నరసింగరావు, ఒమ్మి సుజాత

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):
భారతీయ జనతా పార్టీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిని మంగళవారం ప్రకటించనుంది. ఇటీవల విశాఖలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పలువురి పేర్లను పరిశీలించారు. ఈ పదవికి నలుగురు పోటీ పడుతున్నారు. జిల్లా అధ్యక్ష పదవిని పరుశురామరాజు, విజయానంద్ రెడ్డి, కరణం నరసింగరావు, మహిళా మోర్చా నాయకురాలు ఒమ్మి సుజాత ఆశిస్తున్నారు. వీరిలో ఒకరిని ఎంపిక చేసి మంగళవారం ప్రకటిస్తారు. ప్రస్తుతం బీజేపీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షునిగా మేడపాటి రవీంద్ర వ్యవహరిస్తున్నారు. ఆయన ఈ పదవిలో ఐదేళ్లుగా కొనసాగుతున్నారు. జిల్లాల పునర్విభజన తరువాత పార్లమెంటును జిల్లాగా తీసుకొని అధ్యక్షులను నియమించారు. రవీంద్రను రెండోసారి కూడా కొనసాగించారు. ఇప్పుడు విశాఖ పార్లమెంటు నియోజకవర్గం లోని ఎస్.కోట నియోజకవర్గాన్ని బీజేపీ విజయనగరం జిల్లాలో కలిపివేసింది. విశాఖ తూర్పు, ఉత్తరం, పశ్చిమ, దక్షిణ, గాజువాక, భీమిలి నియోజకవర్గాలను జిల్లాగా పరిగణించి దానికి అధ్యక్షుడిని నియమిస్తోంది.

రేపటి నుంచి జేఈఈ మెయిన్స్ పరీక్షలు

- నగరంలో ఐదు కేంద్రాలు, 6,000 మంది విద్యార్థులు

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం నుంచి 24వ తేదీ, తిరిగి 28 నుంచి 30వ తేదీ వరకూ జరగనున్నాయి. ఇందుకోసం నగరంలో ఐదు కేంద్రాలు ఏర్పాటుచేశారు. చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ 1,2, జియో టెక్నాలజీ సెంటర్, షీలానగర్‌లోని ఐయాన్ డిజిటల్, ఆనందపురం మండలంలోని ఎస్ఎస్ఆర్ఐటీలో ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12, తిరిగి మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి. సుమారు ఆరు వేల మంది ఈ పరీక్షలు రాయనున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏటా రెండు దఫాలు (సెషన్స్) ఈ మెయిన్స్ నిర్వహిస్తుంది. రెండో సెషన్ ఏప్రిల్ తొలి వారంలో జరుగుతాయి.

భీమిలి డీఎల్‌డీవోగా హరిప్రసాద్

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వద్ద ఓఎస్డీగా పనిచేసిన కె.హరిప్రసాద్‌ను కీలకమైన భీమిలి డివిజన్ స్థాయి డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీవో)గా నియమించారు. విశాఖ పరిసరాల్లో పోస్టింగ్ దక్కాలంటే పలుకుబడి ఉండాలి. అటువంటిది గత ప్రభుత్వంలో మంత్రి వద్ద పనిచేసిన అధికారి నగరానికి ఆనుకుని ఉన్న భీమిలి డీఎల్‌డీవోగా నియమితులు కావడం చర్చనీయాంశమైంది. ఇక విశాఖపట్నం డ్వామాలో అడిషనల్ పీడీగా ఉన్న ఎం.రోజారాణిని విజయనగరం డీఎల్‌డీవోగా నియమించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

బెట్టింగ్ కేసులో నేతలు, పోలీసులు?

- బుకీలతో పరిచయం
- పోలీసుల దర్యాప్తులో ఆధారాలు లభ్యం
- వివరాలను గోప్యంగా ఉంచుతున్న అధికారులు
- 300కిపైగా ఖాతాల నుంచి రూ.500 కోట్లుకిపైగానే లావాదేవీలు జరిగినట్టు ప్రచారం



విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):

నగరంలో కలకలం రేపిన క్రికెట్ బెట్టింగ్ కేసు దర్యాప్తు ఊహించని మలుపులు తిరుగుతోంది. బుకీలకు రాజకీయ నేతలతోపాటు పోలీస్ శాఖలో పనిచేస్తున్న కొందరితో పరిచయాలు ఉన్నట్టు బయటపడినట్టు ప్రచారం జరుగుతోంది. పోలీసులు మాత్రం దర్యాప్తు వివరాలను బయటకువెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు.

పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలో గల గాయత్రి టవర్స్‌లోని ఒక ఫ్లాట్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఈనెల 12న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి లగుడు రవికుమార్ అనే బుకీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. లోతైన దర్యాప్తు కోసం కేసును సైబర్‌క్రైమ్ పోలీసులకు సీపీ శంఖబ్రతబాగ్చి అప్పగించారు. రవికుమార్ ఎస్‌యూడీఏ మొబైల్ యాప్ ద్వారా పెద్దఎత్తున బెట్టింగ్ చేసిన్నట్టు, 92 బ్యాంకు ఖాతాలకు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా వందకుపైగా లావాదేవీలు జరిపినట్టు గుర్తించారు. రవికుమార్ వద్ద లభించిన ఇతర ఆధారాల ద్వారా బెట్టింగ్‌లో కాకినాడకు చెందిన కార్తీక్, జిలానీతోపాటు శివాజీపాలేనికి చెందిన బొబ్బిలి రవికుమార్, ఇసుకతోటకు చెందిన పల్లా త్రినాథ్ ప్రమేయం ఉన్నట్టు గుర్తించి వారికోసం గాలింపు ప్రారంభించారు. వారందరి సెల్‌ఫోన్‌ల కాల్ డేటాతోపాటు బ్యాంకు ఖాతాల లావాదేవీలను విశ్లేషించగా బెట్టింగ్ భారీగా జరిగినట్టు తేలింది. రవికుమార్ తర్వాత ఈనెల 17న నలుగురిని, 18న మరో ముగ్గురిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్టు పత్రికా ప్రకటన విడుదల చేశారు. అయితే వారిపేర్లుగానీ, ఇతర వివరాలుగానీ పేర్కొనకపోవడంతో పోలీసుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసుల్లో ఇప్పటివరకూ 80 బ్యాంకు ఖాతాల ద్వారా రూ.176 కోట్ల లావాదేవీలు జరిగినట్టు గుర్తించామని, ఆయా ఖాతాల్లో ఉన్న రూ.45 లక్షలు ఫ్రీజ్ చేశామని పోలీసులు పేర్కొన్నప్పటికీ సుమారు 300పైగా బ్యాంకు ఖాతాల ద్వారా రూ.500 కోట్లు విలువైన బెట్టింగ్ ... మిగతా 6వ పేజీలో

22-ఏ జాబితాపై దృష్టి

ప్రభుత్వేతర భూముల తొలగింపునకు కసరత్తు

- నెలాఖరులోగా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీ నిర్ణయం
- పోర్టు, వీఎంఆర్‌డీఏ భూములకు మినహాయింపు
- ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 687 అర్జీలు రాక
- 455 పరిష్కారం... పరిశీలనలో మరో 232



విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):
ప్రభుత్వ భూములకు సంబంధించిన జాబితా 22-ఏ నుంచి ప్రభుత్వేతర భూముల వివరాలు తొలగింపుపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించింది. అనేక కారణాల వల్ల ప్రభుత్వ భూముల జాబితాలో చేర్చబడిన ప్రైవేటు భూములను తొలగించనున్నది. తొలుత విశాఖ పోర్టు, వీఎంఆర్‌డీఏకు చెందిన భూములను 22-ఏ నుంచి తొలగించాలని నిర్ణయించింది. ఇటీవల ముగిసిన రెవెన్యూ సదస్సుల్లో 22-ఏ జాబితా నుంచి భూముల తొలగింపుపై జిల్లావ్యాప్తంగా 687 అర్జీలు రాగా, వాటిలో 455 పరిష్కరించారు. మరో 232 అర్జీలను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో 22-ఏ నుంచి తొలగించిన భూముల్లో సుమారు ఐదు వేల ఎకరాలు విశాఖ పోర్టుకు చెందినవే. పోర్టుకు చెందిన మరో ఐదు వేల ఎకరాల వివరాలు 22-ఏలో ఉన్నాయి. వీటిని కూడా ఆ జాబితా నుంచి తొలగించేందుకు నివేదిక సిద్ధం చేశారు. ఇవి ఎక్కువగా గోపాలపట్నం, ములగాడ మండలాల పరిధిలో ఉన్నాయి. జిల్లాలో 19 గ్రామాల్లో వీఎంఆర్‌డీఏకు 2,500 నుంచి మూడు వేల ఎకరాలు ఉన్నాయి. ప్రభుత్వం ద్వారా దఖలు పడిన ఈ భూముల్లో వీఎంఆర్‌డీఏ లేఅవుట్లు వేసింది. మరికొన్ని వేలం ద్వారా విక్రయించింది. అయితే వీటిలో కొన్ని ఇంకా ప్రభుత్వ భూములుగానే రికార్డుల్లో ఉన్నాయి. దీంతో వీఎంఆర్‌డీఏ వద్ద కొన్న భూములు/ప్లాట్లు

... మిగతా 6వ పేజీలో

స్టీల్ ప్లాంటుకు ఆర్థిక ప్యాకేజీ ఇప్పించి మాట నిలబెట్టుకున్నాం

- కర్మాగారాన్ని శతశాతం ఉత్పత్తి స్థాయికి తీసుకురావలసిన బాధ్యత యాజమాన్యం, కార్మిక వర్గానిదే
- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- సొంత గనుల కేటాయింపు కోసం ప్రభుత్వపరంగా సహకారం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు

గాజువాక, జనవరి 20:
స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోసం ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకుందని, ఇప్పుడు కర్మాగారాన్ని శతశాతం ఉత్పత్తి స్థాయికి తీసుకురావలసిన బాధ్యత కార్మికులు, యాజమాన్యంపై ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న స్టీల్ ప్లాంటును పరిరక్షించుకోవాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ప్రధాని మోదీని ఒప్పించి రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇప్పించారన్నారు. స్టీల్‌ప్లాంటుకు జీవం పోశారన్నారు. స్టీల్ ప్లాంటుకు ఆర్థికంగా చేయూతనిచ్చిన కూటమి ప్రభుత్వానికి నమ్మకం కలిగించే దిశగా కార్మికులు, యాజమాన్యం సమష్టిగా శ్రమించాలన్నారు. గతంలో బీఐఎఫ్ఆర్ నుంచి తప్పించడంలో, ప్రస్తుతం ఆర్థిక ప్యాకేజీ ఇప్పించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలకపాత్ర పోషించారన్నారు. భవిష్యత్తులో సొంత గనులు

... మిగతా 6వ పేజీలో

నమ్మాళ్వార్ పరమ పదోత్సవంతో అధ్యయనోత్సవాలు సంపూర్ణం


వేదికపై పరమపదవాసుడిగా ఉత్సవమూర్తి

సింహాచలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రామానుజాచార్యులు విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని వ్యాప్తికి కృషిచేసిన ఆళ్వార్లలో ఒకరైన నమ్మాళ్వార్ పరమపదోత్సవంతో 20 రోజులుగా వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వార్షిక అధ్యయనోత్సవాలు సంపూర్ణమయ్యాయి.ఇందులో భాగంగా ఈ నెల 10 నుంచి రాపత్తు ఉత్సవాలు జరగ్గా రోజుకో అలంకారంలో సింహగిరి మాడవీధుల్లో స్వామివారి తిరువీధి ఉత్సవాలు వైభవంగా జరిపారు. ఈ క్రమంలో నమ్మాళ్వార్ పరమపదాన్ని చేరుకోవటాన్ని స్మరించుకుంటూ సోమవారం ఆలయ బేడామండపంలో ప్రత్యేక ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధ్యయనోత్సవాలలో దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావు, ఏఈవోలు నక్కాన ఆనందకుమార్, వీబీవీ రమణమూర్తి, పర్యవేక్షణాధికార్లు త్రిమూర్తులు, జివివిఎస్‌కె ప్రసాద్, తదితర సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక

ఆనందపురం జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సీజీఆర్‌ఎఫ్, ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను మంగళవారం నిర్వహిస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి సీజీఆర్‌ఎఫ్ ఛైర్మన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మసిలమణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, స్వతంత్ర సభ్యులు ఎన్.మురళీకృష్ణ హాజరవుతున్నార న్నారు. కార్యక్రమంలో మండలంలోని 26 పంచాయతీల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు నివేదించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సర్వీసు ప్రొవైడర్ల మేళా

కొమ్మాది, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సర్వీస్ ప్రొవైడర్లకు మేళా సోమవారం పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాలులో జీవీఎంసీ అధికారులు అందజేశారు. జీవీఎంసీ, 5, 6, 7, 8 వార్డులకు సంబంధించిన ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, టైలరింగ్ వంటి 15రకాల వృత్తులు నిర్వహించే వారిని గుర్తించి త్వరలోనే ట్రైనింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కిశోరీ వికాసంపై నేడు శిక్షణ


పద్మనాభం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కిశోరీ వికాసంపై పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణలో సచివాలయంలోని మహిళా పోలీసులు, సంక్షేమ సహాయకులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, నోడల్ అధికారులు పాల్గొంటారన్నారు.

దివ్యాంగ పింఛన్‌దారుల ధ్రువీకరణపై విచారణ


అయినాడలో దివ్యాంగుడి వివరాలు తెలుసుకుంటున్న బృందం

పద్మనాభం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పింఛన్లు పొందుతున్నవారి వివరాలను తిరిగి ధ్రువీకరించడానికి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం విచారణ జరిపారు. 10 గ్రామ పంచాయతీలలో మంచానికే పరిమితమైన దివ్యాంగులు 33 మంది పింఛన్లు పొందుతున్నారు. వీరికి రూ.15 వేలు వంతున పింఛను అందుతోంది. వీటిలో కొన్ని తేడాలు ఉన్నాయన్న సమాచారం ప్రభుత్వానికి వెళ్లడంతో పరిశీలనకు ఆదేశించింది. రేవిడి, అయినాడ, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో విచారణ చేపట్టారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వప్న, భీమిలి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కళ్యాణి, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ సునీత, కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

వైసీపీ ఇన్‌చార్జి దృష్టికి సమస్యలు


మజ్జి శ్రీనివాసరావుతో వైసీపీ నాయకులు

తగరపువలస, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులైన మజ్జి శ్రీనివాసరావును సోమవారం తగరపువలస పరిధిలోని ఆ పార్టీ నాయకులు విజయనగరంలోని ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. పలు సమస్యలను ప్రస్తావించారు. చిల్ల భాస్కరరెడ్డి, డబ్బీరు ప్రశాంతి, ఎ.మంగరాజు, బి.హరి కిరణ్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డితో కూడిన నాయకుల బృందం ఈ ప్రాంత సమస్యలను వివరించింది. తాను వచ్చి అందరు నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

మామిడి రైతుకు పొగమంచు గుబులు

తెగుళ్లు సోకే ప్రమాదం ఉండడంపై ఆందోళన


మామిడి చెట్లకు మందులు కొడుతున్న రైతులు

పద్మనాభం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది రోజుల నుంచి అధికంగా పొగమంచు కురుస్తుండడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రైతులు సుమారు 2500 ఎకరాలకు పైగా మామిడి పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత దశలో ఉంది. ఈ సమయంలో పొగ మంచు పడుతుండడంతో తేనేమంచు పట్టడంతో పురుగు పట్టి పూత మాడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతుందని అంటున్నారు. మామిడి సస్యరక్షణ చర్యలకు అధిక వ్యయం అవుతుందన్నారు. ఎన్నో వ్యయప్రయాలకు గురై పూత నిలబెట్టినా ప్రయోజనం ఉండడం లేదని చెబుతున్నారు. ఒక వైపు వాతావరణ పరిస్థితులు, మరో వైపు మామిడిని ఆశిస్తున్న తెగుళ్ల రైతులు జేబులను చిల్లు చేస్తున్నాయన్నారు. మామిడితో పాటు జీడి పంట పరిస్థితి కూడా ఇలాగే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ కూడా మామిడి సస్యరక్షణ చర్యలకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులను రాయితీపై సరఫరా చేయడంతో పాటు పంటల బీమాకు కూడా అవకాశం కల్పిస్తే కొంత వరకు ఉపశమనం కలుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

7వ వార్డు అభివృద్ధికి సహకరించండి

జీవీఎంసీ కమిషనర్‌కు కార్పొరేటర్ మంగమ్మ వినతి


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మంగమ్మ

మధురవాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :గ్రేటర్ విశాఖ 7వ వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, అందుకు అవసరమైన నిధు లుకేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ సోమవారం స్పందన కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలోని స్వతంత్రనగర్ కాలనీ, కృష్ణానగర్, భరత్‌నగర్, తారకరామనగర్, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులు నిర్మించాలని.., చంద్రంపాలెం, దుర్గానగర్, నగరంపాలెం, కళానగర్, ముత్యాలమ్మగుడి, బింద్రానగర్, తారకరామనగర్, మొగదారమ్మకాలనీ, టైలర్స్ కాలనీ, శ్యామ్‌నగర్, దోబీ కాలనీ, స్వతంత్రనగర్ కాలనీ ప్రభుత్వ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో కాలువలు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కమిషనర్‌ను కోరారు. అలాగే వార్డు పరిధిలోని పలుచోట్ల విద్యుత్ వీధిదీపాలు.., పోర్టు కాలనీ, షిప్‌యార్డు కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని మంగమ్మ కోరారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు ఉన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

విశాలాక్షినగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్ఆర్‌బీ) పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కైలాసగిరి రిజర్వ్ పోలీసు మైదానంలో పురుష అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు సోమవారం సజావుగా కొనసాగాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలలో 600 మంది హాజరు కావాల్సి ఉండగా, 272 పురుష అభ్యర్థులు హాజరు అయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహనరావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు ఎస్.బాల సూర్యారావు, ఎల్.మన్మథరావు, బి.రామకృష్ణారావు, టి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో దత్తేశ్వరానంద భారతీస్వామి



సింహాచలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామిని కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీస్వామి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామీజీకి ఆహ్వానం పలికారు. అంతరాలయంలో అర్చకులు లోకకల్యాణం అనే సంకల్పంతో పూజలు చేయగా గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు చతుర్వేద వచనాలతో ఆశీర్వచనాలీయగా, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు స్వామివారి ప్రసాదాలను అందజేయగా స్వామీజీ సిబ్బందికి మంగళాశాసనాలు చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో వినతుల స్వీకారం


వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వినతులు సమర్పించాలని తహసీల్దారు కె.ఆనందరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివిధ సమస్యలపై 10 వినతులు వచ్చాయన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఎంపీడీవో విజయకుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. పద్మనాభం-రెడ్డిపల్లి రహదారి విస్తరణ పనులను సత్వరమే చేపట్టాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను తహసీల్దారు ఆదేశించారు. ఆయా శాఖలకు చెందిన కార్యాలయాలకు కావలసిన వసతులపై కూడా చర్చించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇనాం భూముల సమస్య పరిష్కారానికి పరిశీలన

భీమునిపట్నం (రూరల్) జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గత నెల వివిధ గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో అందిన వినతులలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక పరిశీలన చేపట్టారు. జిల్లాలో ఇనాం భూముల సమస్య భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోనే ఉంది. వీటికి సంబంధించి 53 మంది దరఖాస్తులు అందించారు. తాటితూరు, అన్నవరం, మజ్జివలస, మజ్జిపేట తదితర గ్రామాల్లో అత్యధికంగా ఇనాం భూముల సమస్య వచ్చింది. చాలా మంది రైతులు సాగుదారులుగా ఉన్నప్పటికీ వారికి పాసుపుస్తకాలు, పట్టాలు అందించలేదు. గ్రామమంతా ఒకరి పేరుతోనే పట్టాభూమిగా ఉండటం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో భూ బదలాయింపు కోరుతూ దరఖాస్తులు చేసుకున్న 46 మందిలో అత్యధికంగా ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. సింగనబంద, కృష్ణంరాజుపేట, డొకరపేట, లక్ష్మీపురం గ్రామాల్లో గతంలో చేసిన భూ సర్వేలో పొరపాట్లు జరిగాయని, ఒకే నంబరు అనేకమందికి కేటాయించడంతో ఇబ్బందులు వచ్చాయంటున్నారు. వాటిని పరిష్కరించాలని సింగనబందలో అధికారుల సమావేశాన్ని కూడా రైతులు బహిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ గ్రామాల రైతులు కొంతకాలంగా కోరుతున్నా అధికారులు పటించుకోవడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ఆరోపించారు. తమ భూములను రీసర్వే చేయాలని 303 మంది దరఖాస్తులు సమర్పించగా, చర్యలకు అధికారులు ఉపక్రమించారు. కొన్ని భూములు 22ఏ విభాగంలో చేర్చడంతో ఇంటి స్థలాలుగా వినియోగించడానికి అవకాశం లేకపోతోందని, దీనిని తొలగించాలని పలువురు కోరారు. ఇలాంటి వారు ఈ మూడు మండలాల్లో 206 మంది వరకు ఉన్నారు. వినతులను దశల వారీగా పరిష్కరించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు భీమిలి కేంద్రంగా ఆర్‌డీఓ కార్యాలయం కూడా ఉండటంతో ఈ పనులను చురుగ్గా చేస్తున్నారు.

జమ్మిచెరువులో బోటు షికారు ఏర్పాటుకు వినతి


జడ్పీకి వినతిని అందిస్తున్న నూకరాజు

భీమునిపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమిలి చిన్నబజారు ప్రాంతంలో ఉన్న జమ్మిచెరువు పార్కులో బోటు షికారు ఏర్పాటు చేస్తే సందర్శకులు పెరుగుతారని, తద్వారా ఆదాయం సమకూరుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు సూచించారు. సోమవారం జీవీఎంసీ భీమిలి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆయన జడ్పీ ప్రసన్న వాణికి ఈ విషయమై వినతిపత్రం అందించారు. నూకరాజు మాట్లాడుతూ పర్యాటకంగా భీమిలి పట్టణం అభివృద్ధి చెందుతూ, సందర్శకులు రోజురోజుకు పెరుగుతున్నారన్నారు. వారికి పట్టణంలో సదుపాయాలు కల్పించాలన్నారు. బీచ్‌రోడ్‌లో ఛత్రపతి శివాజీ, భీమ, బకాసురుల విగ్రహాలు, ఇతర సోయగాలు ఏర్పాటు చేయాలని కోరారు. నేరెళ్లవలస, బొడ్డేటిగెడ్డ వద్ద అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనాలు పూర్తి చేయాలని కోరారు. టీడీపీ నాయకులు తమ్మిన సూరిబాబు తగరపువలసలో మంచినీటి సరఫరా, వీధి దీపాల మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తం 10 అర్జీలు అందాయని, వాటిలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 7, పట్టణ ప్రణాళిక విభాగం 2, ప్రజారోగ్య విభాగానిది ఒకటి ఉన్నట్లు జడ్పీ ప్రసన్న వాణి తెలిపారు. వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేశామని, పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి బదిలీ

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిణిగా పనిచేస్తున్న ఎస్‌జే మాధవిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమెను మాతృ శాఖకు పంపుతూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తక్షణమే పోస్టు నుంచి రిలీవ్ అవుతూ మైనారిటీ సంక్షేమాధికారి బాధ్యతలను మైనారిటీ కార్పొరేషన్ ఈడీకి అప్పగించాలని ఆదేశించింది.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

భీమునిపట్నం (రూరల్) జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని భీమిలి ఎస్ఐ బి.హరీష్ కోరారు. సామాజికమాధ్యమాలపై సోమవారం భీమిలి మండలం తాటితూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ వంటి ఫీచర్ల వల్ల విద్యార్థులకు సమయం వృథా కావడం తప్ప ఉపయోగం లేదన్నారు.

మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మృతి


బొండా నర్సింహమూర్తి (ఫైల్)

భీమునిపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భీమిలి పురపాలక సంఘం మాజీ వైస్ ఛైర్మన్ బొండా నర్సింహమూర్తి(70) సోమవారం మృతి చెందారు. పట్టణంలోని కీటిన్‌పేటలో నివసిస్తున్న ఆయనను ఈ నెల 13న ఊపిరితిత్తుల సమస్యపై నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం కుదుటపడడంతో స్వగృహానికి తీసుకువచ్చారు. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఆరోగ్యం విషమించి తుదిశ్వాస విడిచారు. భీమిలి మునిసిపాలిటీలో టీడీపీ కౌన్సిలరుగా గెలుపొంది వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2019లో వైసీపీలో చేరారు. పట్టణంలో వ్యాపారవేత్తగా, రాజకీయ నాయకుడిగా మంచిపేరు పొందారు. వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఛైర్మన్‌గా, వాసవి ప్రార్థన మందిరం నిర్మాణం, అమ్మవారి ఉత్సవాల నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేశారు. టెన్నిస్ క్రీడాకారునిగా మంచి గుర్తింపు ఉంది. ఆయన మృతి పట్ల పట్టణంలోని పలువురు నాయకులు, వర్తక సంఘం వారు సంతాపం వ్యక్తంచేస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పశు ఆరోగ్య శిబిరాలతో మేలు


ఆరోగ్య శిబిరాల గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

పద్మనాభం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని విశాఖపట్నం జిల్లా పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ ఎం.చంద్రశేఖరరావు సూచించారు. రెడ్డిపల్లి పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావుతో కలిసి పశువైద్య శిబిరాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 31 వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో పశువులకు వైద్య చికిత్స, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ పద్ధతిలో పశు యాజమాన్య విధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు. శిబిరంలో 742 పశువులు, లేగదూడలు, గొర్రెలు, మేకలు, కోళ్లకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి మహేష్, గోపాల మిత్ర సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిన్ డీసీపీగా కృష్ణకాంత్‌పాటిల్

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో అడ్మిన్ డీసీపీగా కృష్ణకాంత్‌పాటిల్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కృష్ణకాంత్‌పాటిల్ ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్నారు. ఇంతవరకు నగర పోలీస్ కమిషనరేట్‌లో అడ్మిన్ ఏడీసీపీగా అదనపు ఎస్పీ స్థాయి అధికారి మాత్రమే ఉండగా ఇప్పుడు ఎస్పీ స్థాయి అధికారిని నియమించడం విశేషం.

గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఆర్కేమీనాకు బదిలీ

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ అదనపు డీజీపీగా పనిచేస్తున్న రాజీవ్‌కుమార్‌మీనాకు బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వు లు జారీచేసింది. రాష్ట్రపోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎస్ఎల్‌పీఆర్‌బీ) ఛైర్మెన్‌గా ఆయన్ను నియమించారు. ఆర్కేమీనా స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించకపోవడంతో ఆ పోస్టు భర్తీకాలేదు.

ప్రమాదంలో పాఠశాల ప్రహరీ గోడ


ప్రహరీపై పడేసిన రాళ్లు

సింహాచలం, జనవరి 20 : మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల సింహాచల పాఠశాల ప్రహరీ కూలిపోకుండా పరిరక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్ర నిధులతో పాఠశాలకు ఆనుకుని రాష్ట్ర పర్యాటకశాఖ, దేవదాయశాఖ చేపడుతున్న బస్‌కాంప్లెక్స్, రీచార్జింగ్ స్టేషన్ వంటి నిర్మాణాల కోసం తవ్విన మట్టిని పాఠశాల తూర్పువైపు ప్రహరీ గోడ మీద డంప్ చేసి వదిలేశారు. దీంతో గోడ కూలిపోయే ప్రమాదం ఉందని, ఉభయ శాఖల అధికారులు తక్షణం ప్రహరీ గోడ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైళ్లకు మహా కుంభమేళా తాకిడి

... 5వ పేజీ తరువాయి

(07107)లో ఫిబ్రవరి 23 వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది.

అనుసంధాన రైళ్లను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

శాశ్వత ప్రాతిపదికన నడుస్తున్న రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్లలో దొరకకపోవడంతో కుంభమేళాకు వెళ్లాలనుకుంటున్నవారు కొందరు ప్రత్యామ్నాయంగా అనుసంధాన (కనెక్టివిటీ) రైళ్లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ నుంచి భువనేశ్వర్, పూరి వెళ్లి...అక్కడ నుంచి వారణాసి, దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్లకు చేరేందుకు సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12875), పురుషోత్తం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12801), తేజాస్ ఎక్స్‌ప్రెస్ (22823) రైళ్లను ఆశ్రయిస్తున్నారు. ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళా జరగనున్న నేపథ్యంలో ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లను కొనసాగించే అవకాశాలు ఉన్నాయి.

22-ఏ జాబితాపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

తిరిగి వేరొకరికి విక్రయించడం లేదా బ్యాంకుల్లో తనఖా పెట్టేందుకు 22-ఎ అడ్డంకిగా మారింది. దీంతో ప్లాట్లు, భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు/సంస్థల యజమానులు ఇప్పుడు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారం కావడం లేదు.

22-ఏ జాబితాలో చేర్చిన ప్రైవేటు వ్యక్తుల భూములను తొలగించాలని ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో కూడా 22-ఏ నుంచి తమ భూములు తొలగించాలని కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. వీఎంఆర్‌డీఏ నుంచి కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన సర్వే నంబర్లను 22-ఎ నుంచి తొలగిస్తే ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ చెబుతున్నారు.

ఇంకా పోర్టు భూములకు 22-ఎ నుంచి తొలగింపు ప్రక్రియపై దృష్టిసారించామన్నారు. ఈ నెలాఖరుకు చాలా వరకు భూములను 22-ఎ నుంచి తొలగిస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

స్టీల్ ప్లాంటుకు ఆర్థిక ప్యాకేజీ ఇప్పించి మాట నిలబెట్టుకున్నాం

... 5వ పేజీ తరువాయి

కేటాయింపు, కర్మాగారాన్ని ఆధునికీకరించే విషయంలో కూటమి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ప్రధానంగా స్టీల్‌ప్లాంటు కోసం భూములిచ్చి సర్వం కోల్పోయిన సుమారు ఎనిమిది వేల మంది నిర్వాసితులకు న్యాయం చేసేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు.

స్టీల్‌ప్లాంటు గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోసం గత వైసీపీ పాలనలో ఎటువంటి ప్రయత్నం చేయకపోగా, కర్మాగారం భూముల్లో రాజధానిని ఏర్పాటు చెయ్యాలని, లేనిపక్షంలో అమ్మేయాలని జగన్ కుటిల ప్రయత్నాలు చేశారని పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ప్లాంటు కోసం ఒక్క పైసా కూడా తేలేకపోయిన వైసీపీ నేతలు... ఆ విషయం మరిచిపోయి ఇప్పుడు ఆర్థిక ప్యాకేజీ ఇప్పించిన కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తే కార్మికులు, ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. గత ప్రభుత్వంలో తన నియోజకవర్గంలో ఉన్న మైన్స్‌ను రెన్యువల్ చేయించని మాజీ మంత్రి బొత్స కూడా స్టీల్‌ప్లాంటు గురించి మాట్లాడడం మరింత విడ్డూరంగా ఉందని విమర్శించారు. విలేకరుల సమావేశంలో ఏపీ స్టేట్ అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన నాయకులు కోన తాతారావు, గడసాల అప్పారావు, బీజేపీ నాయకుడు ఎల్లాజీరావు, పలువురు కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బెట్టింగ్ కేసులో నేతలు, పోలీసులు?

... 5వ పేజీ తరువాయి

జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్టు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా బుకీలతో సంబంధాలు కలిగి ఉన్నారనే అభియోగంపై స్పెషల్‌బ్రాంచిలో పనిచేస్తున్న ఒక హెడ్‌కానిస్టేబుల్‌ను సీపీ సస్పెండ్ చేయగా, మరికొందరు పోలీసుల ప్రమేయాన్ని కూడా అధికారులు గుర్తించినట్టు సమాచారం. బుకీలతో పోలీస్ శాఖలో పనిచేస్తున్న కొందరితో పాటు వైసీపీకి చెందిన పలువురు నాయకులకు కూడా సంబంధాలు ఉన్నట్టు దర్యాప్తులో గుర్తించినప్పటికీ ఆచితూచి వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఎవరైనా చెల్లించకుంటే రౌడీషీటర్లతో బుకీలు బెదిరించేవారు. ఇదేవిధంగా తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఒక యువకుడు రూ.15 లక్షలు చెల్లించకపోవడంతో కొబ్బరితోటకు చెందిన రౌడీషీటర్ ద్వారా బెదిరించాడు. యువకుడు తన పరిస్థితిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఈనెల మొదటి వారంలో నేరుగా సీపీ శంఖబ్రతబాగ్చిని కలిసి ఫిర్యాదుచేశారు. సీపీ ఆదేశాలతోనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు పెదవాల్తేరులోని ఒక ప్లాట్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న లగుడు రవికుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారని పోలీస్ శాఖలో కొందరు చెబుతున్నారు. బెట్టింగ్ కేసు దర్యాప్తు గురించి సైబర్‌క్రైమ్ పోలీసుల వద్ద ప్రస్తావిస్తే దర్యాప్తులో ఉందని చెప్పి దాటవేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

వైసీపీ నేతల మాస్టర్‌ప్లాన్‌కు చెక్

... 5వ పేజీ తరువాయి

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో వీఎంఆర్‌డీఏ కామన్ స్పేస్‌గా చూపించిన స్థలాన్ని కమర్షియల్‌గా మార్చేశారు. ఈ మాస్టర్‌ప్లాన్ వల్ల వైసీపీ నేతలు భారీగా లబ్ధి పొందగా, సామాన్యులు చాలా నష్టపోయారు. దీనిపై ఇప్పటికే ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.

ఆనందపురం మండలం గంభీరం గ్రామంలోని సర్వే నంబర్లు 74/పి, 39/పి, 76/పి, 37/పి, 88/పి, 16/పి, 15/పి, 13/పి, 12/పి, 21/పి, 6/పి, 9/పి'ల గుండా 60 అడుగుల రహదారిని వీఎంఆర్‌డీ మాస్టర్ ప్లాన్-2041లో ప్రతిపాదించారు. అయితే సర్వే నంబరు 88/పి నుంచి ఇప్పటికే అక్కడ 35-40 అడుగుల రహదారి ఉందని, దానిని పొడిగించుకుంటే సరిపోతుందని, అలా కాకుండా మాస్టర్‌ప్లాన్ ప్రకారం వెళితే...అక్కడ చాలా మంది రైతులు నష్టపోతారంటూ విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు వీఎంఆర్‌డీఏ సెక్రటరీతో పాటు ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ విచారణలో దీనిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కమిషనర్‌ని ఆదేశించింది. కొత్తగా అభ్యంతరాలు స్వీకరించి, ఎక్కువ మంది ప్రయోజనం కలిగేలా తక్కువ నష్టంతో మాస్టర్ ప్లాన్‌ను సవరించాలని ఆదేశించింది.

ఇప్పటి మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌గానే పరిగణిస్తాం

- విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

వాస్తవానికి ఇప్పుడున్న మాస్టర్‌ప్లాన్ ప్రభుత్వం ఆమోదించినదే అయినా...తీవ్రమైన విమర్శలు ఉన్న నేపథ్యంలో దానిని 'డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్'గానే పరిగణిస్తాం. అవసరమైన కన్సల్టెంట్‌ను నియమించుకున్నాక అభ్యంతరాలు ఆహ్వానిస్తాం. ఆ తరువాత అన్నీ క్రోడీకరించి ప్రభుత్వ ఆమోదంతో ఫైనల్ మాస్టర్ ప్లాన్-2041 ఖరారు చేస్తాం.


వినతులు స్వీకరిస్తున్న శ్రీవల్లి, శేషాద్రి

పీజీఆర్ఎస్‌కు 24 వినతులు

గాజువాక, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 24 వినతులు వచ్చాయి. అన్ని శాఖల అధికారులు పాల్గొన్న పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అర్జీలు అందజేశారు. ముఖ్యంగా భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వీధి లైట్లు వెలిగేలా చూడాలని, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవల్లి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొర్రమాంబ పరస


అమ్మవారి సన్నిధిలో పల్లా, తదితరులు

అగనంపూడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 89వ వార్డు పరిధి శనివాడ వేపచెట్టు జంక్షన్ వద్ద బొర్రమాంబ పరసను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో విచ్చేసి బొర్రమాంబను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరసను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్ల, సాముగారిడీలు, బొమ్మల కొలువు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కర్రి దశేంద్ర, ఎం.విజయ్, జి.రుద్రకుమార్, హరిత, సూర్యనారాయణ, ఎం.కనకరాజు, కనకభవానీ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

పెదగంట్యాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ్ అధ్యక్షుడిగా ఎం.పెంటారావు, ఉపాధ్యక్షులుగా ఎస్.రమణ, పి.జగన్నాథం, కె.పైడిరాజు, ప్రధాన కార్యదర్శిగా గొందేశి గురప్పరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా యు.పి.రాజు, సీహెచ్ త్రినాథ్‌మోహన్, యు.నూకరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సీహెచ్ పరదేశి, కోశాధికారిగా టి.వెంకట నాయుడు, కార్యాలయ కార్యదర్శిగా జి.నరసింగరావు ఎన్నికయ్యారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 15, వంకాయలు(తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 36, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 46, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 20, క్యారెట్ 44 దొండకాయలు 40, బంగాళదుంపలు 26, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 110, అల్లం 48, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోసకాయలు 30, వెల్లుల్లి 300, కొబ్బరికాయ 25, బీన్స్ 50, పొటల్స్ 80, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 40, కంద 56, దేముడుచిక్కుడు 44, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర(పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిదగుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ప్యాకేజీలతో స్వల్ప ఉపశమనమే..


దీక్షా శిబిరంలో మోహన్‌గాంధీ, దశరథరామిరెడ్డి, పోరాట కమిటీ నాయకులు, తదితరులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు మోదీ ప్రకటించాలి

ఉక్కు ఉద్యమనేత టి.అమృతరావు మనవడు మోహన్‌గాంధీ

కూర్మన్నపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారానికి తాత్కాలిక ప్యాకేజీల వల్ల స్వల్ప ఉపశమనమే గానీ పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరదని ఉక్కు ఉద్యమనేత దివంగత తమనంపల్లి అమృతరావు మనవడు టి.మోహన్‌గాంధీ అన్నారు. స్టీల్‌ప్లాంటుకు సొంత గనులను కేటాయించి, పూర్తి స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ కాదంటూ కేంద్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,439వ రోజుకు చేరగా, శిబిరానికి మోహన్‌గాంధీతో పాటు ఆలిండియా జైహింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.దశరథరామరెడ్డిలు విచ్చేసి కార్మికులకు సంఘీభావం తెలిపారు.

అనంతరం వారు మాట్లాడుతూ అమృతరావుతో పాటు తెలుగు ప్రజల పోరాటాల ఫలితంగా 1971 జనవరి 20న నాటి ప్రధాని దివంగత ఇందిరాగాంధీ ఉక్కు కర్మాగారానికి గుర్తుగా ఉన్న పైలాన్‌కు శంకుస్థాపన చేశారన్నారు. ఉక్కు కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు పోరాటాల ఫలితంగానే కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించందన్నారు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించడంతో పాటు సెయిల్‌లో విలీనం చేస్తున్నట్టు పీఎం మోదీ స్పష్టమైన ప్రకటన చేసేంత వరకు కార్మికులంతా ఈ దీక్షలను కొనసాగిస్తారని పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్‌లు మాట్లాడుతూ ఉద్యోగులకు తక్షణమే జీతాల బకాయిలను చెల్లించాలని, మూడేళ్లు ట్యాక్స్ హాలిడే ప్రకటించాలని, నిలిపివేసిన 800 మంది కాంట్రాక్టు కార్మికులకు వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.రామారావు, యు.రామస్వామి, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, వేములపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంలోనే 'ఉక్కు'ను కొనసాగించాలి

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఉక్కు ఉద్యమనేత అమృతరావు మనవడు టి.మోహన్‌గాంధీ అన్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన దినోత్సవం సందర్భంగా సోమవారం అమృతరావు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం నాడు అమృతరావు ప్రాణాలకు తెగించి ఆమరణ నిరాహార దీక్ష చేశారన్నారు. ఎంతోమంది ప్రాణ త్యాగాల ఫలితంగా ఏర్పడిన ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పలువురు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంటును కాపాడుకునేందుకు ఎలాంటి పోరాటాలకైనా తాము సిద్ధమన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, పీవీ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సమస్యలు తిష్ఠ

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న రామచంద్రా నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు


వసతుల లేమితో ఉన్న రామచంద్రానగర్‌లోని శ్మశానవాటిక

పెదగంట్యాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి రామచంద్రానగర్ కాలనీ సమీపంలో ఉన్న శ్మశానవాటికలో సమస్యలు తిష్ఠ వేశాయి. నిర్వహణ లోపంతో శ్మశానవాటిలో సమస్యలు మరింత అధికమవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రామచంద్రానగర్, రిక్షా కాలనీ, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, సీతానగరం, పెద నడుపూరు కాలనీ ప్రజలందరూ ఈ శ్మశానవాటికనే వినియోగిస్తుంటారు. కాగా ఇక్కడ నిర్మించిన బర్నింగ్ యూనిట్ షెడ్డులో ఐరన్ స్టాండులు లేవు. ఒక షెడ్డుపై వేసిన రేకులు విరిగిపోయి ఎప్పుడు ఎవరిపై పడతాయో అన్నట్టు భీతికొల్పుతున్నాయి. ఇంకో షెడ్డును నిర్మించేందుకు ఆరు కాలమ్స్ వేసి వదిలేశారు. దీనికి శ్లాబ్ కూడా వేయలేదు. అలాగే శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో దహన సంస్కారాలు చేసేందుకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. బరియల్ గ్రౌండ్ చుట్టూ ఉన్న ప్రహరీ గోడ తగినంత ఎత్తులో లేకపోవడం వల్ల శవ దహనాలు ఆ రోడ్డున రాకపోకలు సాగించే వారందరికీ కనిపిస్తుండడంతో వారు కొంత అసౌకర్యానికి గురవుతున్నారు. శ్మశానవాటికలో నెలకొన్న సమస్యలను జీవీఎంసీ అధికారుల దృష్టికి స్థానిక కార్పొరేటర్ తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని సీతానగరానికి చెందిన పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, కార్పొరేటర్ స్పందించి శ్మశానవాటికలో వసతుల కల్పనకు కృషి చేయాలని కోరుతున్నారు.

రూ.20 లక్షలు మంజూరైనప్పటికీ..

-గంధం శ్రీనివాసరావు, 76వ వార్డు కార్పొరేటర్



శ్మశానవాటికలోని సమస్యలను పరిష్కరించేందుకు జీవీఎంసీ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయించాం. బరియల్ గ్రౌండ్ ప్రహరీ ఎత్తును పెంచేందుకు, సెక్యూరిటీ రూమ్ నిర్మాణానికి, పూర్తి సౌకర్యాలతో బర్నింగ్ యూనిట్, వాటర్ లైన్లు ఏర్పాటు, తదితర పనుల కోసం ఆరుసార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. మళ్లీ టెండర్లు పిలవాలని అధికారులపై ఒత్తిడి తెస్తాం.

సర్వీస్ ప్రొవైడర్స్ మేళాను వినియోగించుకోవాలి

» పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు

మల్కాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ ప్రొవైడర్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు) పిలుపునిచ్చారు. శ్రీహరిపురం ఆస్పత్రి ప్రాంగణంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన మేళాను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వడ్రంగులు, ప్లంబింగ్, విద్యుత్ పనులుచేసే వారంతా మేళాను వినియోగించుకోవాలన్నారు. సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ ఇచ్చి హోమ్ ట్రయాంగిల్ సంస్థ యాప్ ద్వారా ఆన్ బోర్డు చేస్తారన్నారు.


సదస్సులో పాల్గొన్న టెక్నీషియన్స్ నుంచి పత్రాలను స్వీకరిస్తున్న జెడ్సీ కె.హైమావతి

ఈ కార్యక్రమంలో జోన్ 5 కమిషనర్ రాము, ఏపీడీ కృపానందం, అంగ దుర్గాప్రశాంతి, పొలిమేర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంటలో...

వేపగుంట: జోన్ 8 పరిధిలోని వేపగుంట సామాజిక భవనంలో సోమవారం ఉదయం మెప్మా, హోమ్ ట్రయాంగిల్ ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్సీ కె.హైమావతి మాట్లాడుతూ వార్డులో ఉన్న కులవృత్తులు, టెక్నీషియన్స్, ఇంటి వద్ద ఉండే టైలరింగ్, బ్యూటీకోర్సులు నిర్వహించేవారంతా మేళాను వినియోగించుకోవాలని సూచించారు. చేతివృత్తులు, కరెంట్, మోటారు, వడ్రంగి, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, వాషింగ్, గ్రీజర్, రిఫ్రిజిరేటర్ టెక్నీషియన్స్ రెస్యూమ్‌లను ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో అప్‌గ్రేడ్ చేయించారు. దాదాపు 100 మంది నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, నేతలు శోభారాణి జ్యోతి, ఏపీడీ చిరంజీవి పాల్గొన్నారు.


మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

వినతులకు సత్వర పరిష్కారం చూపాలి: జెడ్సీ


పెండింగ్ వినతులపై అధికారుల వివరణ కోరుతున్న జెడ్సీ

వేపగుంట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జెడ్సీ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ఐదు వినతులు అందాయి. వీటిలో ముఖ్యంగా జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోట సాయిమాధవనగర్‌లో కనవయ్య అనే బిల్డర్ హుద్‌హుద్‌లో పర్యావరణానికి మేలు చేసేలే వేసిన బాదం చెట్టును నరికివేయడంపై చర్యలు చేపట్టాలని, 96వ వార్డు పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యుత్ దీపం ఏర్పాటు చేయాలని, 97వ వార్డు సుజాతానగర్‌లో చెట్ల కొమ్మల వలన ఇబ్బందులు తొలగించాలని, 98వ వార్డు భరత్‌నగర్‌లో కాలువపై పలకలు తొలగించి శుభ్రం చేయాలని, పద్మావతినగర్‌లో డైనేజీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధితశాఖాధిపతులకు పంపించి చర్యలు చేపడతామని జెడ్సీ పేర్కొన్నారు.

ఆర్టీసీకి తగ్గని ప్రయాణికుల రద్దీ

» సోమవారం 151 ప్రత్యేక సర్వీసులు నడిపిన అధికారులు

ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తిరుగు ప్రయాణికుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. ఆర్టీసీ దూర ప్రాంత సర్వీసులతో పాటు జోన్ పరిధిలో తిరిగే సర్వీసులు కూడా కిటకిటలాడాయి. సంక్రాంతి పండగ జరుపుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రలోని తమ స్వస్థలాలకు వచ్చిన వారంతా పండగ ముగిసిన తరువాత తిరిగి తాము పనిచేసే ప్రదేశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు.

ఒకేసారి అధికసంఖ్యలో జనం ప్రయాణానికి సిద్ధమవడంతో రద్దీ కొనసాగింది. ఆర్టీసీ కాంప్లెక్సులకు వచ్చిన ప్రయాణికులను గమ్యానికి చేర్చేందుకు షెడ్యూల్ సర్వీసులతో పాటు 151 ప్రత్యేక సర్వీసులు అధికారులు నడిపారు. విశాఖపట్నం నుంచి దూర ప్రాంతాలైన హైదరాబాద్‌కు 8, విజయవాడకు 25, శ్రీకాకుళం 50, విజయనగరం 10, పార్వతీపురం 15, పాలకొండ 15, రాజమండ్రి 10, కాకినాడ 6, పలాస 6 టెక్కలి 4, సోంపేట 2 చొప్పున ప్రత్యేక సర్వీసులు నడిపిన అధికారులు అవసరమైతే మరిన్ని సర్వీసులు నడిపేలా సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ద్వారకాకాంప్లెక్సులోని అన్ని ప్లాటుఫారాల్లో బస్సు వెనుక బస్సు గొలుసుకట్టుగా పెట్టి మరీ ప్రయాణికులను తరలించారు. ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధం చేశామని, అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులు వేస్తామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

» పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశు ఆరోగ్య శిబిరాలు వినియోగించుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 20 నుంచి 31 వరకు నిర్వహించనున్న పశు ఆరోగ్య శిబిరం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడుతూ పాడి పరిశ్రమ ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందేలా అధికారులు కృషి చేయాలన్నారు. రైతులు ఈ శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి డా.జగన్మోహనరావు, సహాయ సంచాలకులు రవికుమార్ పాల్గొన్నారు.


శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సద్వినియోగం చేసుకోవాలి

సింధియా: రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏకేసీ కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 31 వరకు నిర్వహించే శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యుడు సునీల్ జబ్బవాపు, గొంతువాపు, చిటుక వ్యాధి నివారణ టీకాలపై రైతులకు అవగాహన కల్పించారు. సాధారణంగా పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు టీకాలు వేస్తున్నామన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

స్టీల్‌ప్లాంట్ ప్రగతి కోసం శివాలయంలో పూజలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారానికి మళ్లీ పూర్వ వైభవం రావాలని, ప్లాంట్ పురోగతి దిశలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ కర్మాగారం లోపల గల పురాతన శివాలయంలో సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు పూజలు జరిపారు. ప్లాంట్ మంచి ప్రగతి సాధించాలని, ఉద్యోగుల ప్రధాన సమస్యలు పరిష్కారం కావాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరుతూ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యేల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్‌దారులకు నేటి నుంచి వైద్య పరీక్షలు

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్న వారిలో అనర్హులను ఏరివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి నెలా రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న వారిలో అనర్హులు ఎవరైనా ఉన్నారేమోనని గుర్తించేందుకు వైద్య బృందాలు ఇళ్లకు వెళుతున్నాయి. ఈ కార్యక్రమం ఈనెల 22వ తేదీతో ముగియనున్నది. జిల్లాలో 319 మంది పింఛన్‌దారులు ప్రతి నెలా రూ.15 వేలు తీసుకుంటున్నారు. కాగా నెలకు రూ.ఆరు వేలు పింఛన్ పొందుతున్న దివ్యాంగులు జిల్లాలో 21,306 మంది (శారీరక వైకల్యం 12,238 మంది, దృష్టిలోపం..2,373 మంది, వినికిడి లోపం 2,287 మంది, మానసిక వ్యాధులతో బాధపడేవారు 4,408 మంది) ఉన్నారు. వారంతా అర్హులేనా?, కాదా?...అన్నది పరిశీలించాలని కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ నేపథ్యంలో ఎటువంటి లోపంతో పింఛన్ తీసుకుంటున్నారో గమనించి...అందుకు సంబంధించి వైద్య పరీక్షలు మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. సుమారు రెండు నెలలపాటు సాగే ఈ పరీక్షల ప్రక్రియను మంగళవారం ప్రాంతీయ కంటి ఆస్పత్రి నుంచి ప్రారంభించనున్నారు. జిల్లాలో మండలాలు, జీవీఎంసీ పరిధిలో జోన్‌ల వారీగా పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశారు. వైద్య పరీక్షలకు సంబంధించి ప్రతి సచివాలయం పరిధిలో దివ్యాంగులకు సమాచారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఉచిత పశు వైద్య శిబిరం వాల్ పోస్టర్లు ఆవిష్కరణ


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇల్లపు ప్రసాద్, తదితరులు

అగనంపూడి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశు వైద్యశాల వద్ద సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూటమి నాయకుడు ఇల్లపు ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. పది రోజుల పాటు నిర్వహించే పశు వైద్య ఆరోగ్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య, స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, తలారి శ్రీను, చందు, వడ్డాది శ్రీను, అప్పలరాజు, ఇందిరారాణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టరూ..


వడ్లపూడి ముస్లిం వీధిలో వృథాగా పోతున్న తాగునీరు

కూర్మన్నపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి ముస్లిం వీధిలో తాగునీరు వృథాగా పారడం నిత్యకృత్యంగా మారిం దని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ గత కొన్ని రోజులుగా నీరు వృథాగా పారు తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని వాపోతున్నారు. అలాగే వార్డు పరిధిలోని కణితి, రాజులపాలెం, గవరవీధి, అప్పికొండ పరిసర ప్రాంతాల్లో పైపు లైన్లకు లీకేజీలు ఏర్పడి తాగునీరు వృథాగా రహదారులపై పారుతూ మురుగు కాలువల్లో కలిసిపోతుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పెన్షన్ సమస్యను పరిష్కరించాలని 'పల్లా' వినతి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పూర్తి వేతనంపై పెన్షన్ ఇవ్వాలని కోరుతూ రీజనల్ పీఎఫ్ కమిషనర్‌లు విజయ్‌కుమార్‌ప్రసాద్, పవన్ జాస్తీలకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. పీఎఫ్ కార్యాలయంలో ఉక్కు అధికారుల సంఘం, పెన్షనర్ల సంఘం ప్రతినిధులతో కలిసి సోమవారం ఆయన కమిషనర్‌లను కలిశారు. పూర్తి వేతనంపై పెన్షన్ కోసం స్టీల్‌ప్లాంటులో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇప్పటికీ పింఛన్ రావడం లేదన్నారు. ప్లాంటులో సుమారు 1800 మంది పదవీ చేసిన విరమణ ఉద్యోగులు రూ.400 కోట్లు వరకు చెల్లించారని, వారంతా పూర్తి పెన్షన్ కోసం నిరీక్షిస్తున్నారని వివరించారు. వారికి త్వరితగతిన న్యాయం చేయాలని పల్లా కోరారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, పెన్షనర్ల సంఘం ప్రతినిధులు వాసా మూర్తి, రంగనాథ్, శ్రీనివాస్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక రేపు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అంకుపాలెంలో ఈ నెల 25 నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొనే విశాఖ జిల్లా జట్లును ఈ నెల 22న ఎంపిక చేయనున్నట్టు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావులు తెలిపారు. గాజువాక హైస్కూల్ మైదానంలో ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే పురుషులు 85 కిలోలలోపు, మహిళలు 75 కిలోల లోపు బరువుండాలని పేర్కొన్నారు.

గర్భాశయ కణితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంలో కీలక పాత్ర వహించే గర్భాశయ కణితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ వసంత దాసరి అన్నారు. షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో సోమవారం గర్భాశయ క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సకాలంలో దీనిని గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు


నూతనంగా ఎన్నికైన ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు

పెందుర్తి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ విశాఖ జిల్లా నిర్మాణ మహాసభలో భాగంగా సోమవారం జిల్లా నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వై.రాంబాబు, కెంగువ అచ్యుత్, సహాయ కార్యదర్శిగా కొమర సందీప్, ట్రెజరర్‌గా పి.శివ, ఉపాధ్యక్షుడిగా ఉల్లం నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా మధురెడ్డి, భగది రవి, శ్రీను. మరో పదిమందిని నియమించారు.

కాలువ మరమ్మతులు ప్రారంభం


యంత్రాలతో పనులు చేపడుతున్న దృశ్యం

సింధియా, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 62వ వార్డు అబేడ్కర్ కాలనీ ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో స్థానికులు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి మరమ్మతులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రూ.14లక్షల జీవీఎంసీ నిధులతో సోమవారం పనులు చేపట్టారు. కార్యక్రమంలో పెద్దాడ ప్రసాద్, రామకృష్ణ, రావాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో పరస మహోత్సవం రేపు

అక్కయ్యపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు జగన్నాథపురంలో వేంచేసిన భూలోకమాత, ముత్యమాంబ, కుంచుమాంబ, వేంకటేశ్వర స్వామి సీతారాముల వారి పరస మహోత్సవం బుధవారం జరగనున్నట్లు గౌరీ సేవాసంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ తెలిపారు. ఆలయాల ఆవరణలో సోమవారం సాయంత్రం సంఘ ప్రతినిధులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవార్లకు బుధవారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు తప్పెటగుళ్లు, సేవా గరిడీలు, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. సంఘ ప్రతినిధులు పొలమరశెట్టి ప్రసాద్, రాజగిరి అప్పలరాజు, మళ్ల త్రినాథరావు, పిళ్లా ఫకీరు నాయుడు, ఆడారి పారుపల్లి పాల్గొన్నారు.

స్వయంశక్తితో ఎదిగితే గుర్తింపు



నూతన కార్యవర్గ సభ్యులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్ జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికీ సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం విశాఖ ఓల్డ్ మోటార్ పార్ట్స్ స్కూటర్, స్క్రాప్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సంఘ భవన నిర్మాణానికి అవకాశం కల్పించాలని అభ్యర్థించగా, తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహ్మాన్, యూనియన్ కార్యదర్శి సలాం అబ్దుల్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

రైతులకు స్టాళ్లు కేటాయింపు



డ్రా కార్డులు అందచేస్తున్న ఎస్టేట్ అధికారి

సీతమ్మధార, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తెచ్చుకున్న కూరగాయలను రైతుబజార్‌లో ఎక్కడైనా అమ్ముకోవడానికి వీలుగా పారదర్శకంగా స్టాల్స్‌ను డ్రా తీసి కేటాయించినట్లు సీతమ్మధార రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణ మూర్తి తెలిపారు. రైతుబజార్‌లో సోమవారం డ్రా తీశారు. అనంతరం రైతులకు స్టాల్స్ కేటాయించారు. రైతు సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'విద్యార్థినులకు సహాయం అందిస్తా'



బాలికలతో కలిసి భోజనం చేస్తున్న క్రికెటర్ జీవీఎస్ కమలాకర్

సీతమ్మధార, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని పాపా హోమ్‌లో విద్యార్థినులకు అల్పాహారం, భోజనాలను జాతీయ క్రికెటర్, కాంగ్రెస్ పార్టీ స్పోర్ట్స్ చైర్మన్ జీవీఎస్ కమలాకర్ సమకూర్చారు. ఆయన జన్మదినం సందర్భంగా సోమవారం పాపాహోమ్‌లో బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు క్రీడలు, విద్యాపరంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

భగత్‌కి కోఠి ఎక్స్‌ప్రెస్‌కు అశోక్‌నగర్ స్టేషన్‌లో హాల్ట్

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ-భగత్‌కి కోఠి మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అశోక్‌నగర్ స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-భగత్‌కి కోఠి ఎక్స్‌ప్రెస్‌కు (18573) జులై 15 వరకు, తిరుగు ప్రయాణంలో రైలుకు జులై 10 వరకు ప్రయోగాత్మక హాల్ట్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



వసతిగృహంలో నిరాశ్రయులు

అక్కయ్యపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చాలా రోజులుగా స్నానాలు లేకుండా దుర్గంధంతో రోడ్లపై తిరుగుతున్న అయిదుగురికి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కొద్ది రోజుల నుంచి వైజాగ్‌కు చెందిన భీమరశెట్టి జ్యోతి ప్రకాశ్ (56), ప్రతాప్ (45), సాలూరు వాసి అలమండ శంకర్ (42), రాజస్థాన్‌కు చెందిన సికిందర్ (40), పార్వతీపురం ప్రాంతీయుడు గొడ్డి కంచరి కృష్ణను ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా గమనించి వసతిగృహానికి తరలించినట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో పోలమాంబ తొలేళ్ల సంబరం



ఘటాభిషేకానికి కలశాలతో జలాన్ని తీసుకెళ్తున్న మహిళలు



పసుపు అద్దిన ముఖంతో పోలమాంబ అమ్మవారు



రేలారే రేలా జానపద నృత్యరూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

జగదాంబ కూడలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జగదాంబ సమీపంలోని కుమ్మరవీధి ప్రాంతం పోలమాంబ అమ్మవారి 67వ పరస ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పసుపు అద్దారు. ఈ రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి కలశం నెత్తిన పెట్టుకునేందుకు ఎగబడ్డారు. అమ్మవారి గుడి నుంచి డప్పుల వాయిద్యాల నడుమ సాగిన ఘటాభిషేకంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం ముత్తయిదువలు 108 కలశాలతో పోలమ్మ గుడి నుంచి ఊరేగింపుగా ఆదిదేవాలయంలో పసుపు అద్ది ఉన్న పోలమాంబ వద్దకు చేరుకుని జలాభిషేకం చేశారు. ప్రతి ఇంటి నుంచి బిందెడు నీళ్ల అమ్మవారికి వేయడానికి ఉత్సాహం చూపారు. మేళతాళాలతో సందడిగా ఘటాభిషేకం నిర్వహించారు. కుమ్మరవీధి, తాడివీధి, సాలిపేట పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి తిలకించారు. పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసులు పర్యవేక్షించారు.

. హుషారుగా రేలారే రేలా..

'నాదీ నక్కిలీసు గొలుసు.. బావొచ్చాడో.. పల్సర్ బైక్.. తదితర హుషారైన జానపద గీతాల 'రేలారే రేలా' కార్యక్రమం సోమవారం రాత్రి ఆహూతులను రంజింపజేసింది. ఉత్తరాంధ్ర జిల్లాల జానపద గీతాలతో కళాకారులు ఆలపించి, నర్తించిన రూపకాలకు జనం నుంచి విశేష స్పందన కనిపించింది. కుమ్మరవీధిలోని పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం సందర్శకులను ఎంతగానో అలరించింది. పెద్దసంఖ్యలో జనం విచ్చేశారు.

నేడు జన జాతర

మంగళవారం తెల్లవారుజాము నుంచి పోలమాంబ పరస ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. అమ్మవారి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో క్యూలైన్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం జాతర తిలకించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. భారీ ఎత్తున ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు ప్రజలు ఎక్కువగా గుమిగూడే అవకాశం ఉందని ఆలయ కమిటీ భావిస్తోంది. టర్నర్ చౌల్ట్రీ మెయిన్ రోడ్డు నుంచి లేపాక్షి వైపు మార్గం పూర్తిగా జనసంద్రం కానుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మహారాణిపేట పోలీసులు శాంతిభద్రతల పర్యవేక్షణకు సోమవారం రాత్రి నుంచే రంగంలోకి దిగారు.

మంచినీటి పైపులైన్లు జాగ్రత్త

అధికారులకు జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ సూచన



33వ వార్డులో అధికార బృందంతో కలిసి పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్

అల్లిపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మంచినీటి పైపులైన్ల నిర్వహణపై దృష్టి సారించాలని, ముఖ్యంగా డ్రైనేజీలకు పైపులైన్లు కలవకుండా చూడాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం 33వ వార్డులో నీలమ్మ వేపచెట్టు, వెంకటేశ్వరమెట్ట, కుమ్మరవీధి ప్రాంతాల్లో కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితిని పరిశీలించారు. కుమ్మరవీధిలో కమ్యూనిటీ హాలు లేనందున, అక్కడి సచివాలయాన్ని కమ్యూనిటీ హాలుగా మార్చాలని కార్పొరేటర్ కోరారు. వార్డులో నివాస భవనాల మధ్య శిథిలావస్థలో ఉన్న పురాతన భవనాన్ని తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. తాగునీటిని నిర్దీత సమయానికి అందించేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.వి.ఎన్. నరేష్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు మురళీకృష్ణ, శ్రీధర్, వెంకటేశ్వరరావు, విల్సన్, జనసేన నాయకులు భీశెట్టి గోపికృష్ణ, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంట్ కొనసాగింపు ప్రకటనకు డిమాండ్

అల్లిపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె. అచ్యుతరావు డిమాండ్ చేశారు. కేంద్ర ం ప్రకటించిన రూ.11,500 కోట్ల సాయం తాత్కాలిక ఉపశమనమేనని, పూర్తి సామర్థ్యంతో ప్రభుత్వరంగ సంస్థగా మనుగడ సాగించాలంటే సొంత గనులు కేటాయించాలని సూచించారు. ఇప్పుడున్న రూ.37,000 కోట్ల షేర్ క్యాపిటల్‌ను పునర్ వ్యవస్థీకరించి సెయిల్‌లో కలపడం ద్వారా స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ వైభవం కోసం కార్మిక సంఘాల ఐక్యవేదిక చేస్తున్న పోరాటానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.

జయగోపాల్‌కు పెరియార్ అవార్డు



అవార్డు ప్రదర్శిస్తున్న నాస్తిక సమాజం నాయకులు

సీతంపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాస్తికవాది, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ జయగోపాల్‌కు మరణానంతరం చెన్నైలో పెరియార్ అవార్డును ప్రదానం చేసినట్లు భారత నాస్తిక సమాజం నాయకులు టి.శ్రీరామమూర్తి, వై.నూకరాజు తెలిపారు. సాంఘిక ఉద్యమకారుడు పెరియార్ అవార్డును ద్రవిడ కజగం నాయకులు డాక్టర్ కె.వీరమణి ఈ నెల 15న అందించినట్లు వారు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయం తెలియజేశారు. ఎనిమిది రాష్ట్రాల్లో మూఢనమ్మకాల నిర్మూలన, హక్కుల సాధనకు పనిచేయడం, దళితులు, మహిళలపై దాడులకు వ్యతిరేకంగా, మానవ హక్కుల పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా పెరియార్ అవార్డు అందించారని తెలిపారు. అంతర్జాతీయంగా మానవ హక్కుల కోసం కృషి చేసిన డాక్టర్ జయగోపాల్‌కు గతంలో కెనడా సంస్థ పెన్ ఆఫ్ బ్రేవ్ మైండ్స్ అవార్డు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ అవార్డు అందిన స్ఫూర్తితో సమాజంలో శాస్త్రీయ భావనలు పాదుగొల్పడానికి సంస్థ మరింత పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం.పైడిరాజు, జె.శ్యామల, జె.సునీత, రాంప్రభు, విజ్ఞానంద్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటర్ గ్రీష్మకు పురస్కారం



విశాఖపట్నం స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరానికి అంతర్జాతీయ స్కేటర్ డి.గ్రీష్మకు ఎన్‌సీసీ కేడెట్స్‌కు ఇచ్చే ప్రతిష్ఠాత్మక కేంద్ర రక్షణ మంత్రి పురస్కారం లభించింది. సోమవారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గ్రీష్మకు పురస్కారాన్ని అందించారు. స్కేటింగ్‌లో కోచ్‌లు పి.సత్యనారాయణ (సత్యం), కె.చిట్టిబాబు వద్ద శిక్షణ పొందిన గ్రీష్మ... ఆర్టిస్టిక్స్ ఈవెంట్స్‌లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ, జాతీయ స్థాయి టోర్నీల్లో పతకాలు సాధించింది. అలాగే విద్యాభ్యాసంలో భాగంగా ఎన్‌సీసీలో ర్యాంకులు సాధించి ప్రతిష్ఠాత్మక రక్షణ మంత్రి పురస్కారం పొందింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

అసంపూర్తి భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో?



శ్రీనివాసనగర్‌లో అసంపూర్తిగా ఉన్న భవనం

అక్కయ్యపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని ప్రజారోగ్య కేంద్రం మేడపై అదనపు అంతస్తు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రజారోగ్య కేంద్రం, మొదటి అంతస్తు సచివాలయాలు ఉన్నాయి. రెండో అంతస్తు నిర్మాణం చేపట్టి ఆర్పీలు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు, కల్యాణమండపం కోసం ఈ నూతన భవనాన్ని కేటాయించేందుకు నిర్మాణం చేపడుతున్నట్లు గతంలో ప్రకటించారు. దీన్ని నిర్మించేందుకు ఇప్పటి వరకూ రూ.38 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిసింది. అయినా అసంపూర్తిగా నిలిచిపోయింది. పిల్లర్లు, స్లాబ్ వేసి ఆపేశారు. మిగతా పనులు చేపట్టేందుకు నిధులు చాలకపోవడంతో నిలిపివేసి ఉండొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ భవనంపై అదనపు అంతస్తు నిర్మించేందుకు శంకుస్థాపన జరిగింది. ఆ తర్వాత భవన నిర్మాణాన్ని కొంత నిర్మించి మిగతాది వదిలేశారు. మిగతా భాగాన్ని పూర్తిచేసేందుకు నిధులు కేటాయించాలని జీవీఎంసీ కమిషనర్‌ను కోరామని, నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం పునఃప్రారంభిస్తామని కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ తెలిపారు. భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉర్సు ఉత్సవాలు



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లింలు

అక్కయ్యపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముస్లిం తాటిచెట్లపాలెంలో హజరత్ ఖాదర్ వలీ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉర్సు ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ముగిశాయి. తొలిరోజు ఫజర్ నమాజ్ అనంతరం దైవ గ్రంథం ఖురాన్ పఠనం, మగ్రిబ్ నమాజు అనంతరం చందనోత్సవం ఊరేగింపు, ఫాతెహా దరూద్ జరిగింది. రెండో రోజు పిల్లలకు ఆధ్యాత్మిక పోటీలు నిర్వహించారు. వరి రోజు నాత్, వాజ్ ఓ బయాన్ జరిగింది. హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మిక వక్త హజరత్ మౌలానా ఓవైస్ రజా ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. హజరత్ గరీబ్ నవాజ్ జీవిత చరిత్ర, ఇతరుల పట్ల చూపిన ప్రేమ, ఆయన ఇచ్చిన సందేశం తదితర అంశాలను వివరించారు. గరీబ్ నవాజ్‌ను ఆదర్శంగా తీసుకొని సమాజానికి మంచి చేయాలని సూచించారు. కర్ణాటకకు చెందిన ఆధ్యాత్మిక కవి షాహిద్ హుస్సేన్ నూని వారిచే నాత్ షరీఫ్ వినిపించారు. ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ఖాదర్ వలీ కమిటీ సభ్యులు, మసీద్ కమిటీ సభ్యులు ఆధ్యాత్మికవేత్తలను సత్కరించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖ నలుమూలల నుంచి భక్తులు పాల్గొన్నారు.

గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఆర్కే మీనాకు బదిలీ

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ అదనపు డీజీపీగా పనిచేస్తున్న రాజీవ్‌కుమార్‌మీనాకు బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రపోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎస్ఎల్‌పీఆర్‌బీ) చైర్మెన్‌గా ఆయన్ను నియమించారు. ఆర్కేమీనా స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించకపోవడంతో ఆ పోస్టు భర్తీకాలేదు.

అడ్మిన్ డీసీపీగా కృష్ణకాంత్‌పాటిల్

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో అడ్మిన్ డీసీపీగా కృష్ణకాంత్‌పాటిల్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కృష్ణకాంత్‌పాటిల్ ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్నారు. ఇంతవరకు నగర పోలీస్ కమిషనరేట్‌లో అడ్మిన్ ఏడీసీపీగా అదనపు ఎస్పీ స్థాయి అధికారి మాత్రమే ఉండగా ఇప్పుడు ఎస్పీ స్థాయి అధికారిని నియమించడం విశేషం.

24న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా

కంచరపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం బాలికల ఐటీఐని ఆనుకుని ఉన్న నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 24న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉప ఉపాధి కల్పనాధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఈ మేళాలో వెబ్రో సొల్యూషన్స్, ఆస్ట్రో టెక్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. సేల్స్ కోఆర్డినేటర్, ప్రొడక్షన్, కెమిస్ట్ ఆఫీసర్, టెక్నీషియన్, సూపర్ వైజర్ తదితర ఉద్యోగాలకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు నిరుద్యోగ యువత హాజరు కావచ్చని తెలిపారు. పదో తరగతి, ఐటీఐ., డిప్లొమా, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులు. అభ్యర్థులు తమ వివరాలను ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి, అర్హత గల యువత 24న ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని శ్యాంసుందర్ సూచించారు.

జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిణి బదిలీ

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిణిగా పనిచేస్తున్న ఎస్‌జే మాధవిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమెను మాతృ శాఖకు పంపుతూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తక్షణమే పోస్టు నుంచి రిలీవ్ అవుతూ మైనారిటీ సంక్షేమాధికారి బాధ్యతలను మైనారిటీ కార్పొరేషన్ ఈడీకి అప్పగించాలని ఆదేశించింది.

వైసీపీ నేతల మాస్టర్‌ప్లాన్‌కు చెక్

... 5వ పేజీ తరువాయి

బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో వీఎంఆర్‌డీఏ కామన్ స్పేస్‌గా చూపించిన స్థలాన్ని కమర్షియల్‌గా మార్చేశారు. ఈ మాస్టర్‌ప్లాన్ వల్ల వైసీపీ నేతలు భారీగా లబ్ధి పొందగా, సామాన్యులు చాలా నష్టపోయారు. దీనిపై ఇప్పటికే ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.

ఆనందపురం మండలం గంభీరం గ్రామంలోని సర్వే నంబర్లు 74/పి, 39/పి, 76/పి, 37/పి, 88/పి, 16/పి, 15/పి, 13/పి, 12/పి, 21/పి, 6/పి, 9/పి'ల గుండా 60 అడుగుల రహదారిని వీఎంఆర్‌డీ మాస్టర్ ప్లాన్-2041లో ప్రతిపాదించారు. అయితే సర్వే నంబరు 88/పి నుంచి ఇప్పటికే అక్కడ 35-40 అడుగుల రహదారి ఉందని, దానిని పొడిగించుకుంటే సరిపోతుందని, అలా కాకుండా మాస్టర్‌ప్లాన్ ప్రకారం వెళితే...అక్కడ చాలా మంది రైతులు నష్టపోతారంటూ విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు వీఎంఆర్‌డీఏ సెక్రటరీతో పాటు ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ విచారణలో దీనిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని కమిషనర్‌ని ఆదేశించింది. కొత్తగా అభ్యంతరాలు స్వీకరించి, ఎక్కువ మంది ప్రయోజనం కలిగేలా తక్కువ నష్టంతో మాస్టర్ ప్లాన్‌ను సవరించాలని ఆదేశించింది.

ఇప్పటి మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌గానే పరిగణిస్తాం

వాస్తవానికి ఇప్పుడున్న మాస్టర్‌ప్లాన్ ప్రభుత్వం ఆమోదించినదే అయినా...తీవ్రమైన విమర్శలు ఉన్న నేపథ్యంలో దానిని 'డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్'గానే పరిగణిస్తాం. అవసరమైన కన్సల్టెంట్‌ను నియమించుకున్నాక అభ్యంతరాలు ఆహ్వానిస్తాం. ఆ తరువాత అన్నీ క్రోడీకరించి ప్రభుత్వ ఆమోదంతో ఫైనల్ మాస్టర్ ప్లాన్-2041 ఖరారు చేస్తాం.

- విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

22-ఏ జాబితాపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

తిరిగి వేరొకరికి విక్రయించడం లేదా బ్యాంకుల్లో తనఖా పెట్టేందుకు 22-ఎ అడ్డంకిగా మారింది. దీంతో ప్లాట్లు, భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు/సంస్థల యజమానులు ఇప్పుడు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. 22-ఏ జాబితాలో చేర్చిన ప్రైవేటు వ్యక్తుల భూములను తొలగించాలని ఇటీవల సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో కూడా 22-ఏ నుంచి తమ భూములు తొలగించాలని కోరుతూ పలువురు అర్జీలు సమర్పించారు. వీఎంఆర్‌డీఏ నుంచి కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన సర్వే నంబర్లను 22-ఎ నుంచి తొలగిస్తే ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ చెబుతున్నారు. ఇంకా పోర్టు భూములకు 22-ఎ నుంచి తొలగింపు ప్రక్రియపై దృష్టిసారించామన్నారు. ఈ నెలాఖరుకు చాలా వరకు భూములను 22-ఎ నుంచి తొలగిస్తామని ప్రకటించారు. దీనికి సంబంధించి కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

బెట్టింగ్ కేసులో నేతలు, పోలీసులు?

... 5వ పేజీ తరువాయి

జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్టు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా బుకీలతో సంబంధాలు కలిగి ఉన్నారనే అభియోగంపై స్పెషల్‌బ్రాంచిలో పనిచేస్తున్న ఒక హెడ్‌కానిస్టేబుల్‌ను సీపీ సస్పెండ్ చేయగా, మరికొందరు పోలీసుల ప్రమేయాన్ని కూడా అధికారులు గుర్తించినట్టు సమాచారం. బుకీలతో పోలీస్ శాఖలో పనిచేస్తున్న కొందరితో పాటు వైసీపీకి చెందిన పలువురు నాయకులకు కూడా సంబంధాలు ఉన్నట్టు దర్యాప్తులో గుర్తించినప్పటికీ ఆచితూచి వ్యవహరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఎవరైనా చెల్లించకుంటే రౌడీషీటర్లతో బుకీలు బెదిరించేవారు. ఇదేవిధంగా తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఒక యువకుడు రూ.15 లక్షలు చెల్లించకపోవడంతో కొబ్బరితోటకు చెందిన రౌడీషీటర్ ద్వారా బెదిరించాడు. యువకుడు తన పరిస్థితిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు ఈనెల మొదటి వారంలో నేరుగా సీపీ శంఖబ్రతబాగ్చిని కలిసి ఫిర్యాదుచేశారు. సీపీ ఆదేశాలతోనే టాస్క్‌ఫోర్స్ పోలీసులు పెదవాల్తేరులోని ఒక ఫ్లాట్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న లగుడు రవికుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారని పోలీస్ శాఖలో కొందరు చెబుతున్నారు. బెట్టింగ్ కేసు దర్యాప్తు గురించి సైబర్‌క్రైమ్ పోలీసుల వద్ద ప్రస్తావిస్తే దర్యాప్తులో ఉందని చెప్పి దాటవేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

రైళ్లకు మహా కుంభమేళా తాకిడి

... 5వ పేజీ తరువాయి

(07107)లో ఫిబ్రవరి 23 వరకూ బెర్తులు నిండిపోయి నిరీక్షణ జాబితా ఏర్పడింది.

అనుసంధాన రైళ్లను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

శాశ్వత ప్రాతిపదికన నడుస్తున్న రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్లలో దొరకకపోవడంతో కుంభమేళాకు వెళ్లాలనుకుంటున్నవారు కొందరు ప్రత్యామ్నాయంగా అనుసంధాన (కనెక్టవిటీ) రైళ్లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ నుంచి భువనేశ్వర్, పూరి వెళ్లి...అక్కడ నుంచి వారణాసి, దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్లకు చేరేందుకు సమలేశ్వర్ ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12875), పురుషోత్తం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12801), తేజాస్ ఎక్స్‌ప్రెస్ (22823) రైళ్లను ఆశ్రయిస్తున్నారు. ఫిబ్రవరి 26 వరకు మహా కుంభమేళా జరగనున్న నేపథ్యంలో ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లను కొనసాగించే అవకాశాలు ఉన్నాయి.

స్టీల్ ప్లాంటుకు ఆర్థిక ప్యాకేజీ ఇప్పించి మాట నిలబెట్టుకున్నాం

... 5వ పేజీ తరువాయి

కేటాయింపు, కర్మాగారాన్ని ఆధునికీకరించే విషయంలో కూటమి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ప్రధానంగా స్టీల్‌ప్లాంటు కోసం భూములిచ్చి సర్వం కోల్పోయిన సుమారు ఎనిమిది వేల మంది నిర్వాసితులకు న్యాయం చేసేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు.

స్టీల్‌ప్లాంటు గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

స్టీల్‌ప్లాంటు పరిరక్షణ కోసం గత వైసీపీ పాలనలో ఎటువంటి ప్రయత్నం చేయకపోగా, కర్మాగారం భూముల్లో రాజధానిని ఏర్పాటుచెయ్యాలని, లేనిపక్షంలో అమ్మేయాలని జగన్ కుటిల ప్రయత్నాలు చేశారని పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ప్లాంటు కోసం ఒక్క పైసా కూడా తేలేకపోయిన వైసీపీ నేతలు... ఆ విషయం మరిచిపోయి ఇప్పుడు ఆర్థిక ప్యాకేజీ ఇప్పించిన కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తే కార్మికులు, ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. గత ప్రభుత్వంలో తన నియోజకవర్గంలో ఉన్న మైన్స్‌ను రెన్యువల్ చేయించని మాజీ మంత్రి బొత్స కూడా స్టీల్‌ప్లాంటు గురించి మాట్లాడడం మరింత విడ్డూరంగా ఉందని విమర్శించారు. విలేకరుల సమావేశంలో ఏపీ స్టేట్ అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జనసేన నాయకులు కోన తాతారావు, గడసాల అప్పారావు, బీజేపీ నాయకుడు ఎల్లాజీరావు, పలువురు కార్పొరేటర్లు, కూటమి నాయకలు పాల్గొన్నారు.

పెన్షనర్లలో అనర్హుల ఏరివేతకు చర్యలు

- జోన్-3లో 1968 దివ్యాంగ పింఛన్‌దారులు
- నేటి నుంచి దివ్యాంగులకు వైద్య పరీక్షలు
- ప్రత్యేక వైద్యుల బృందం ఏర్పాటు



పింఛన్‌దారుడికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మద్దిలపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అనర్హులైన పింఛన్లపై దృష్టి సారించింది. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారి జామునే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందిస్తుండగా, వీరిలో కొందరు అనర్హులు కూడా ఉంటున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అనర్హులైన పింఛన్ల ఏరివేతకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా.. దివ్యాంగుల కేటగిరిలో అనర్హులు ఉన్నారనే ఫిర్యాదులతో తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో జీవీఎంసీ జోన్-3 యూసీడీ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. జోన్-3లో దివ్యాంగులకు చెందిన అయిదు కేటగిరిల్లో 1968 మంది పింఛన్‌దారులు ఉన్నారు. దివ్యాంగ పింఛనుదారుల ఇంటికి వెళ్లి పరిశీలిస్తున్నారు. మంచం, వీల్‌చైర్లకు పరిమితమైన 32 మంది పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి తనిఖీలు పూర్తి చేశారు. చెవిటి, మూగ, కన్ను, ఆర్థోపెడిక్, మానసిక వైకల్యం.. ఇలా దివ్యాంగుల కోటాలో పింఛన్లు అందుకుంటున్న వారందరికీ మంగళవారం నుంచి ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో తనిఖీలు చేయనున్నారు. జోన్-3లో డయాలసిస్, రోగుల మినహాయించి 1955 మందిని తనిఖీలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. వీరిలో కదలలేని స్థితిలో ఉన్న 32 మందిని ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయగా, 1923 మందికి తనిఖీలు చేయాల్సి ఉంది.

నేటి నుంచి వైద్య పరీక్షలు

జోన్-3లో దివ్యాంగుల పింఛన్‌దారులకు మంగళవారం నుంచి ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో తనిఖీలు నిర్వహించనున్నారు.

ఈ తనిఖీల కోసం జనరల్ ఫిజిషియన్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ వైద్యుల బృందాన్ని నియమించారు. ఆయా వైద్యుల బృందం దివ్యాంగులను పరిశీలించి అందించిన నివేదికలను ఆర్ఎంవో, విధుల్లో ఉన్న వైద్యుల సంతకాలు చేస్తేనే పరిగణనలోకి తీసుకుంటారు. అంతటితో మాత్రమే కాకుండా ఈ తనిఖీలు పూర్తి చేసిన తదుపరి మరో వైద్యబృందంతో పునఃపరిశీలన చేయడానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీని కోసం జోన్-3 యూసీడీ అధికారులు, సచివాలయ ఎమినేట్స్ కార్యదర్శులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాలుగు కేటగిరీల్లో ఎవరెవరు, ఏ తేదీల్లో ప్రాంతీయ నేత్ర వైద్యశాలకు పరీక్షలకు రావాలో పింఛనుదారులకు సమాచారం అందించారు. రోజుకు 90 నుంచి 120 మంది వరకు తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దివ్యాంగ లబ్దిదారులందరూ కచ్చితంగా ఈ తనిఖీలు చేసుకోవాల్సిందే. ఒకవేళ ఎవరైనా పరీక్షలకు హాజరు కాకుంటే పింఛను ఆగిపోయే ప్రమాదముంది. డయాలసిస్, గుండె జబ్బులు, పక్షవాతం వంటి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం రూ.15 వేలు, ఇతర కేటగిరిల్లో దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు అనర్హులు ఈ కేటగిరిల్లో పింఛన్ పొందుతున్నట్టు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

పకడ్బందీగా తనిఖీలు



జోన్-3లో 1968 మంది దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అందరికీ తనిఖీలు నిర్వహిస్తున్నాం. కదలలేని స్థితిలో ఉన్న 32 మంది ఇంటికి వైద్యులు వెళ్లి పరిశీలించారు. మిగతా వారికి మంగళవారం నుంచి కేటగిరీల వారీగా రోజుకు 90 నుంచి 130 మంది వరకు తనఖీలు నిర్వహిస్తారు. తనిఖీల్లో అనర్హులుగా తేలితే పింఛన్ నిలిచిపోతుంది. కచ్చితంగా ప్రతి ఒక్కరూ ఈ తనిఖీలు చేసుకోవాలి.

- రాము లంకాడ, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసీడీ) జోన్-3

దివ్యాంగ పింఛన్‌దారులకు నేటి నుంచి వైద్య పరీక్షలు

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్న వారిలో అనర్హులను ఏరివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి నెలా రూ.15 వేలు పింఛన్ తీసుకుంటున్న వారిలో అనర్హులు ఎవరైనా ఉన్నారేమోనని గుర్తించేందుకు వైద్య బృందాలు ఇళ్లకు వెళుతున్నాయి. ఈ కార్యక్రమం ఈనెల 22వ తేదీతో ముగియనున్నది. జిల్లాలో 319 మంది పింఛన్‌దారులు ప్రతి నెలా రూ.15 వేలు తీసుకుంటున్నారు.

కాగా నెలకు రూ.ఆరు వేలు పింఛన్ పొందుతున్న దివ్యాంగులు జిల్లాలో 21,306 మంది (శారీరక వైకల్యం 12,238 మంది, దృష్టి లోపం..2,373 మంది, వినికిడి లోపం 2,287 మంది, మానసిక వ్యాధులతో బాధపడేవారు 4,408 మంది) ఉన్నారు. వారంతా అర్హులేనా?, కాదా?..అన్నది పరిశీలించాలని కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎటువంటి లోపంతో పింఛన్ తీసుకుంటున్నారో గమనించి..అందుకు సంబంధించి వైద్య పరీక్షలు మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. సుమారు రెండు నెలలపాటు సాగే ఈ పరీక్షల ప్రక్రియను మంగళవారం ప్రాంతీయ కంటి ఆస్పత్రి నుంచి ప్రారంభించనున్నారు.

జిల్లాలో మండలాలు, జీవీఎంసీ పరిధిలో జోన్‌ల వారీగా పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశారు. వైద్య పరీక్షలకు సంబంధించి ప్రతి సచివాలయం పరిధిలో దివ్యాంగులకు సమాచారం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

డాక్టర్ మదన్ మోహన్‌కు ఐటీడీసీ ఎక్సలెన్స్ అవార్డు



మదన్‌మోహన్‌ను అభినందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏయూలోని ఐఏఎస్ఈ విభాగం పూర్వపు అసోసియేట్ ప్రొఫెసర్ మంత్రి మదన్ మోహన్ ఐటీడీసీ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు అభినందించారు. సంప్రదాయ నృత్య రీతులను విద్యారంగానికి అన్వయింపజేసి తద్వారా బోధన పద్ధతుల్లో నూతన మార్పులకు శ్రీకారం చుట్టినందుకు నటరాజ్ డ్యాన్స్ అకాడమీ మదన్‌మోహన్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ బత్తిన విక్రమ్ గౌడ్ చేతులు మీదుగా మదన్‌మోహన్ అవార్డు అందుకున్నారు. విద్యా రంగంలో యోగ, నృత్యంల ప్రభావంపై డాక్టర్ మదన్‌మోహన్ పరిశోధన చేయడం గమనార్హం.

స్కేటర్ గ్రీష్మకు పురస్కారం

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరానికి అంతర్జాతీయ స్కేటర్ డి.గ్రీష్మకు ఎన్‌సీసీ కేడెట్స్‌కు ఇచ్చే ప్రతిష్ఠాత్మక కేంద్ర రక్షణ మంత్రి పురస్కారం లభించింది. సోమవారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గ్రీష్మకు పురస్కారాన్ని అందించారు.

సినిమా గైడ్

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీ నరసింహ-1 (104ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, శారద, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 15, వంకాయలు (తెలుపు)36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 36, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 46, బీరకాయలు 50, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 20, క్యారెట్ 44 దొండకాయలు 40, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 32, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 80, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడ దుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

స్టీల్‌ప్లాంటుకు ప్యాకేజీపై టీడీపీ సంబరాలు

- ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మద్దిలపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు కేటాయించిన సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డు మంగాపురంకాలనీలో సోమవారం టీడీపీ నాయకులు సంబరాలు జరిపారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అండతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. రాష్ట్రానికి సుమారు రూ.3 లక్షల కోట్లు నిధులు అందించి ఆదుకోవడమే కాకుండా స్టీల్ ప్లాంట్‌కు నిధులు కేటాయించి ఊపిరి పోశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారధ్యంలో కేంద్రం నుంచి మరిన్ని నిధులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, కోడిబోయిన ఆనంద్, రాజ్‌కుమార్, నాగూర్ గణేష్, బర్ల రాజు పాల్గొన్నారు.



అళ్వార్‌దాస్‌కు నివాళి అర్పిస్తున్న వాకర్స్ సంఘ ప్రతినిధులు

వాకర్స్ ఆధ్వర్యంలో అళ్వార్‌దాస్‌కు నివాళి

ఎంవీపీ కాలనీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అళ్వార్‌దాస్ వర్ధంతి సందర్భంగా విశాఖ సిటీ శాటిలైట్ సిటీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ కాలనీలోని డబుల్‌రోడ్డులో వాకథాన్ నిర్వహించారు. అనంతరం అళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్ కుమార్, కార్యదర్శి మోహనరావు, కోశాధికారి సత్యారావు, ముఖ్య సలహాదారు ఎన్టీఆర్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల ఆహ్వానితులకు ఏయూ వీసీ అభినందనలు



బుచ్చయ్యనాయుడును అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు, ఏయూ అధికారులు

వెంకోజీపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం జనవరి 26న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక గణతంత్ర వేడుకలలో పాల్గొనేందుకు ఎంపికైన ఏయూ ఎన్ఎస్ఎస్‌కు చెందిన విద్యార్థులను వీసీ జి.శశిభూషణరావు తన కార్యాలయంలో సోమవారం అభినందించారు.ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బీబీఏ చదువుతున్న డి.బుచ్చయ్యనాయుడు, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ న్యాయ కళాశాలలో చదువుతున్న డి.హర్షిత గణతంత్ర దినోత్సవ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొంటున్నారు. వీరు తమ తల్లిదండ్రులతో కలిసి గణతంత్ర దినోత్సవాన్ని వీక్షించడానికి ఢిల్లీకి వెళ్లనున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్ పాల్గొన్నారు.

ఆర్టీసీకి తరగని ఆదరణ

- సోమవారం 151 ప్రత్యేక సర్వీసులు నడిపిన అధికారులు

ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తిరుగు ప్రయాణికుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. ఆర్టీసీ దూర ప్రాంత సర్వీసులతో పాటు జోన్ పరిధిలో తిరిగే సర్వీసులు కూడా కిటకిటలాడాయి. సంక్రాంతి పండగ జరుపుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రలోని తమ స్వస్థలాలకు వచ్చిన వారంతా పండగ ముగిసిన తరువాత తిరిగి తాము పనిచేసే ప్రదేశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఒకేసారి అధికసంఖ్యలో జనం ప్రయాణానికి సిద్ధమవడంతో రద్దీ కొనసాగింది. ఆర్టీసీ కాంప్లెక్సులకు వచ్చిన ప్రయాణికులను గమ్యానికి చేర్చేందుకు షెడ్యూల్ సర్వీసులతో పాటు 151 ప్రత్యేక సర్వీసులు అధికారులు నడిపారు. విశాఖపట్నం నుంచి దూర ప్రాంతాలైన హైదరాబాద్‌కు 8, విజయవాడకు 25, శ్రీకాకుళం 50, విజయనగరం 10, పార్వతీపురం 15, పాలకొండ 15, రాజమండ్రి 10, కాకినాడ 6, పలాస 6 టెక్కలి 4, సోంపేట 2 చొప్పున ప్రత్యేక సర్వీసులు నడిపిన అధికారులు అవసరమైతే మరిన్ని సర్వీసులు నడిపేలా సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ద్వారకాకాంప్లెక్సులోని అన్ని ప్లాటుఫారాల్లో బస్సు వెనుక బస్సు గొలుసుకట్టుగా పెట్టి మరీ ప్రయాణికులను తరలించారు. ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధం చేశామని, అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులు వేస్తామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు



జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న త్రిమూర్తులు

వెంకోజీపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించి భవన నిర్మాణాలు చేపడుతుంటే నియంత్రించాల్సిన అధికారులు, సచివాలయ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, వారు అవినీతికి పాల్పడుతుండడమే ఇందుకు కారణమంటూ గుత్తుల త్రిమూర్తులు అనే వ్యక్తి జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన ఈ ఫిర్యాదు చేశారు. గ్రేటర్ విశాఖ 16వ వార్డులోని భానునగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుకు సంబంధించి ఫిర్యాదు చేశారు. సచివాలయం టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి చేతివాటం చూపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక వార్డు సచివాలయంలో పూర్తి స్థాయిలోనూ, మరో వార్డు సచివాలయంలో ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న మహిళా కార్యదర్శి తనదైన శైలిలో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారని ఫిర్యాదు చేశారు. బిల్డింగ్ అసెస్మెంట్ నెంబరు. 1086/3861/బి/జెడ3/బీఆర్/2024తో మంజూరు ఈ బహుళ అంతస్థు సర్వేనెంబరు 46/5పిలో డోర్ నెంబరు 54-12-67 కలిగి ఉందని నిర్మాణానికి జీవీఎంసీ అనుమతిని మంజూరు చేసిందన్నారు. కానీ ఈ ప్రాంతంలో అసలు 46/5పి సర్వే నెంబరే లేదని, ఈ ప్రాంతం 46/1/ఎ/2లోకి అర్బన్ ల్యాండ్ సీలింగ్‌లోకి వస్తుందని కమిషనర్‌కు వివరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇలాంటి అవినీతి, అక్రమాలపై దృష్టి సారించాలని కోరారు.



భానునగర్‌లో లేని సర్వే నంబర్‌లో చేపట్టిన నిర్మాణం

ఆకట్టుకున్న త్యాగరాజ కీర్తనల ఆలాపన



కీర్తనలు ఆలపిస్తున్న గాయనీగాయకులు

మద్దిలపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో సోమవారం త్యాగరాజ స్వామి కీర్తనలు వీనులవిందుగా సాగాయి.

త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా 16 మంది కళాకారులు త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తూ త్యాగరాజస్వామికి గాత్ర నీరాజనం పలికారు. డాక్టర్ రామవరపు మాధురి నేతృత్వంలో శివోహం పేరుతే శివుగాపై త్యాగరాజస్వామి రాసిన ఆరు పాటలను వీనులకు విందుగా ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఉదయం నుంచి పది నిమిషాల కచేరీలు 65, అరగంట కచేరీలు 6 నిర్వహించి 226 మంది కళాకారులు తమ సంగీతంతో శ్రోతలను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు. కచేరీలో శ్రీలత, ధనుంజయనాయుడు, శారదాసుబ్రహ్మణ్యం, మండపాక శారద గాత్రంలో వీణపై మండపాక శ్రీదేవి, శ్యామల సహ వాయిద్యాలతో ఆద్యంతం రక్తి కట్టించారు.

కార్యక్రమంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ నిర్వహకులు గుమ్ములూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలో ఇటీవల మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం అందించారు. పెదజాలారిపేటకు చెందిన దూడ చిరంజీవి తెలుగుదేశం పార్టీలో చురుగ్గా పని చేసేవాడు. కొద్ది కాలం క్రితం తీవ్ర అనారోగ్యంతో ఆయన మృతి చెందారు. ఈ నేపథ్యంలో పార్టీ తరపున రూ. 2 లక్షలు మంజూరైంది. కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

గురుకులానికి 25 శాతం హాజరు

ఆరిలోవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులానికి సుమారు 22 శాతం మంది విద్యార్థులు హాజరైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి తెలిపారు. సంక్రాంతి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు తెరిచారు. ఈ గురుకులంలో ఐదు నుంచి ఇంటర్ వరకు సుమారు 515 మంది విద్యార్థులకు చదువుతుండగా సోమవారం 138 మాత్రం హాజరయ్యారు. మంగళవారం ఈ శాతం పెరగవచ్చన్నారు.

ప్రజాదర్బార్‌లో 21 వినతులు స్వీకారం



అర్జీలు స్వీకరిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ నిర్వహించే ప్రజాదర్బార్‌లోని ప్రజా సమస్యలు పరిష్కారం కావడం ద్వారా సంస్థపై ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ అన్నారు. సోమవారం వీఎంఆర్డీఏ భవన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వివిధ అంశాలపై ప్రజల నుంచి 21 అర్జీలను అందినట్టు తెలిపారు. వాటిలో ఇంజనీరింగ్ 1, ప్లానింగ్ 12, రెవెన్యూ 6, ఎస్టేట్ 2 , ఇతర విభాగాలకు చెందినవి ఉన్నాయన్నారు. నిర్దిష్ట కాల పరిమితిలోగా పిటిషనర్‌కు సమాధానం ఇచ్చే విధంగా ఉద్యోగులు బాధ్యత వహించాలన్నారు. కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ అర్జీదారులు పలుమార్లు సంస్థ చుట్టూ తిరగకుండా సమస్యకు పరిష్కారం చూపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్టేట్ అధికారి దయానిధి, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, చీఫ్ ప్లానింగ్ అధికారి శిల్ప, హరిప్రసాద్, శివానీ తదితరులు పాల్గొన్నారు.

31 వరకు పశు వైద్య శిబిరాలు



పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రామకృష్ణ, అధికారులు

ఆరిలోవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రామకృష్ణ కోరారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను సోమవారం తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వైద్య శిబిరాల నిర్వహణ కోసం జిల్లాలో 20 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాపతంగా 142 వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలలో సాధారణ చికిత్సలు, శస్త్ర చికిత్సలు, గర్భకోశ చికిత్సలు, నట్టల నివారణ మందులు, ముందస్తు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేస్తారని తెలిపారు. అంతే కాకుండా పాడి, కోళ్ల జీవాల పెంపకాలపై శాస్త్రీయ అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. పాడి పరిశ్రమకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. తొలి రోజైన సోమవారం జిల్లా వ్యాప్తంగా 16 శిబిరాలు ఏర్పాటు చేసి 636 పశువులకు చికిత్సలు, 117 గర్భకోశ పరీక్షలు, 1626 పశువులకు, 3651 జీవాలకు నట్టల నివారణ మందులు ఇవ్వడంతో పాటు 1234 వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు డా.చంద్రశేఖర్, సహాయ సంచలకులు డాక్టర్లు శ్రీనివాస్, మాదిన ప్రసాదరావు, శ్రీనుబాబు పాల్గొన్నారు.

కేర్ ఆస్పత్రిలో రోబోటిక్ ప్రోక్టోకోలెక్టమీ సర్జరీ

- ఏపీలో మొట్టమొదటిసారిగా శస్త్రచికిత్స



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బిశ్వ బసుదాస్, మయూరి చౌదరి తదితరులు

ఆరిలోవ. జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా స్థానికంగా గల కేర్ ఆస్పత్రిలో టోటల్ రోబోటిక్ ప్రోక్టోకోలెక్టమీ సర్జరీ నిర్వహించినట్ట ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ సర్జరీని విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. కేరళకు చెందిన చిన్నయ్య (25)కు పెద్ద పేగులో తీవ్ర నొప్పి వచ్చింది. మల రక్తస్రావం, రక్తహీనతతో బాధ పడుతూ కేవలం స్టెరాయిడ్స్‌పైనే గత మూడేళ్ల నుంచి ఆధార పడుతూ వచ్చాడని చెప్పారు. ఈ నేపథ్యంలో అతడి పొత్తి కడుపు ఓపెన్ చేసి రోబోటిక్ టెక్నిక్ ద్వారా సర్జరీ నిర్వహించినట్టు తెలిపారు. సర్జరీ నిర్వహణకు 5 గంటల సమయం పట్టిందన్నారు. ఇది వైద్య శాస్త్రంలో అపూర్వ విజయమని సర్జకల్ ఎండ్రాలజిస్టు డాక్టర్ బిశ్వ బసుదాస్ పేర్కొన్నారు. రోగి తన పనులు చేసుకోవచ్చన్నారు. అదే ఓపెన్ సర్జరీ అయితే సుమారు మూడు నెలల పాటు బెడ్‌కే పరిమితం కావాల్సి ఉండేదని, కనీసం ఏడాది పాటు విశ్రాంతి అవసరం అయ్యేదన్నారు. ఈ విజయం కేర్ చరిత్రలో ఒక మైలురాయి వంటిదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేర్ ఆస్పత్రి సీవోవో మయూరి చౌదరి, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

డీపీసీ అధ్యాపకుల మౌనదీక్ష రేపు

మద్దిలపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :విజయవాడ ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కార్యాలయం వద్ద ఈ నెల 22న నిర్వహించనున్న డీపీసీ అధ్యాపకుల సత్యాగ్రహ మౌనదీక్షను విజయవంతం చేయాలని డిపార్టమెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) జీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గురవయ్య పిలుపునిచ్చారు. 1998లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను (డీపీసీ) కింద పదోన్నతి కల్పించి జూనియర్ కళాశాల లెక్చరర్లుగా నియమించారని తెలిపారు. 302 జీవో ద్వారా ఆయా లెక్చరర్లు 2018 వరకు సీనియార్టీ ప్రకారం పదోన్నతులు పొందుతూ రిటైర్డ్ అయ్యారని పేర్కొన్నారు. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2024 వరకు ఒక్క పదోన్నతి కూడా కల్పించలేదన్నారు. గత ఏడాది ఎన్నికల కోడ్ వచ్చే ముందు రోజు హడావుడిగా డీపీసీ అధ్యాపకులను పక్కన పెట్టి డైరెక్ట్ రిక్రూట్ అయిన 197 మంది లెక్చరర్లకు అడ్డదారిలో పదోన్నతులు కల్పించిందన్నారు. ప్రమోషనల్ ప్యానల్ ఇయర్ ఆగస్టు 31తో ముగిసినా 38 మంది జూనియర్లకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పెద్దలు, అధికారులకు వినతిపత్రాలు అందించినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అందుకే డీపీసీ అధ్యాపకులకు న్యాయం చేయాలని నిర్వహించనున్న సత్యాగ్రహ మౌనదీక్షలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

24న జాబ్‌మేళా

కంచరపాలెం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):కంచరపాలెం బాలికల ఐటీఐని అనుకుని ఉన్న నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్ వద్ద ఈ నెల 24న నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఉప ఉపాధి కల్పనాధికారి శ్యాంసుందర్ నిట్టల పేర్కొన్నారు. ఈ మేళాలో వెట్రో సొల్యూషన్స్, ఆస్ట్రో టెక్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. సేల్స్ కోఆర్డినేటర్, ప్రొడక్షన్, కెమిస్ట్ ఆఫీసర్, టెక్నీషియన్, సూపర్ వైజర్ తదితర ఉద్యోగాలకు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు నిరుద్యోగ యువత హాజరుకావచ్చని తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులు. అభ్యర్థులు తమ వివరాలను ముందుగా నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి, అర్హత గల యువత 24న ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని శ్యాంసుందర్ సూచించారు.

నిరుద్యోగులకు వెలుగురేఖ!

- అండగా నిలుస్తున్న బీసీ స్టడీ సర్కిల్
- నగరంలో డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ
- తరగతులకు హాజరవుతున్న 95 మంది
- నెలకు రూ.1,500 స్టైఫండ్ ఇస్తున్న ప్రభుత్వం

(ఎంవీపీ కాలనీ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్ నిరుద్యోగులకు వెలుగు రేఖలా మారింది. ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ అందిస్తుండడంతో ఎంతోమంది పోటీ పరీక్షలకు పట్టుదలతో కృషి చేస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో నిపుణులను తీసుకువచ్చి శిక్షణ ఇవ్వడం స్టడీ సర్కిల్ ప్రధాన విధి. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని, ప్రభుత్వం నిర్వహించే పరీక్ష కోసం ఎదురుచూసే అభ్యర్థులకు సరైన మార్గ నిర్దేశంతో పాటు అన్ని సబ్జెక్టులను బోధించడం, సందేహాలను నివృత్తి చేయడం, శిక్షణ కాలంలో అభ్యర్థుల అవసరాలకు ఇబ్బంది లేకుండా స్టైఫండ్‌తో పాటు మెటీరియల్ కోసం కనీస మొత్తం అందిస్తుండడం విశేషం.

ఎంవీపీ కాలనీ ఆరో సెక్టారులోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రస్తుతం డీఎస్సీ ఎస్జీటీ ఉద్యోగార్థులకు శిక్షణ కొనసాగుతోంది. వంద సీట్లకు గాను 95 మంది హాజరవుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 వరకూ ప్రతి రోజూ శిక్షణ ఇస్తున్నారు. అభ్యర్థుల్లో 58 మంది మహిళలు, 37 మంది పురుషులు ఉన్నారు. నవంబరు 16న శిక్షణ ప్రారంభమయింది. మొదటి విడతలో మేథమెటిక్స్, తెలుగు, జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టులను బోధిస్తున్నారు. గణితం సబ్జెక్టుకు తులసీరావు, తెలుగుకు రాంబాబు, జనరల్ నాలెడ్జ్‌కు ప్రసాద్ అధ్యాపకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం హాజరవుతున్న అభ్యర్థుల్లో పోరాట పటిమ బాగుందని, ఇదే రీతిలో కష్టపడితే ఉద్యోగం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని వారంతా అభిప్రాయపడుతున్నారు. కాగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీదేవి నిత్యం శిక్షణను పర్యవేక్షిస్తున్నారు.


బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న డీఎస్సీ అభ్యర్థులు

స్టైఫండ్, మెటీరియల్ కోసం...

శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.1500 స్టైఫండ్ అందిస్తోంది. అంతేకాకుండా మెటీరియల్ కోసం రూ.1000 అందించింది. అయితే శిక్షణ కాలంలో 75 శాతం హాజరు తప్పనిసరిగా పేర్కొంది. అభ్యర్థులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే ఈ మొత్తాన్ని జమచేస్తోంది. ఇదిలా ఉండగా శిక్షణలో మూడు సబ్జెక్టులు చివరి దశకు చేరుకున్నాయి. సోషల్ స్టడీస్, సైన్స్, ట్రై మెథడాలజీ, సైకాలజీ సబ్జెక్టులను త్వరలో ప్రారంభిస్తారు. ఫిబ్రవరి 16 వరకూ శిక్షణ కొనసాగనుంది.

సివిల్స్‌కు అమరావతిలో..

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సివిల్స్‌కు సిద్ధమయ్యేవారికి అమరావతిలో శిక్షణ అందిస్తారు. దీనికి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్ష ఇటీవల బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద మందికి అమరావతిలో పూర్తి వసతి సౌకర్యాలతో ప్రిలిమ్స్, మెయిన్స్‌కు సిద్ధమయ్యేలా శిక్షణ అందిస్తారు. కాగా విశాఖ పట్నం నుంచి 194 మంది పరీక్ష రాయగా 19 మందికి అవకాశం లభించింది. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అభ్యర్థులకు శిక్షణ తేదీని ప్రకటిస్తారని బీసీ సంక్షేమ శాఖాధికారి తెలిపారు.

సీఎం దావోస్ పర్యటనతో రాష్ట్రానికి మేలు

- హోం మంత్రి వంగలపూడి అనిత

సింహాచలం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దావోస్ పర్యటనతో రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేందుకు దోహదపడుతుందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ విధ్వంసకర పాలన నుంచి బయటపడుతున్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే అనేక సంస్థలు తమ సమ్మతిని తెలిపాయన్నారు. అదే క్రమంలో దావోస్ పర్యటన పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక వేదిక అవుతుందన్నారు. నేర నియంత్రణకు ఫ్రెండ్లీ పోలీసింగ్ దోహదపడుతుందన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వంటి నేరపూరిత చర్యలను కూకటి వేళ్లతో పెకిలించేలా కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ఆరునెలల్లో అనేక కేసులు నమోదు చేసి నిందితులకు శిక్షలు పడేలా చేశామన్నారు. పోలీసుల సహకారంతో మహిళలపై జరిగే దాడులపై శిక్షలు పడేలా చర్యలు చేపట్టామన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి 70కి పైగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామన్నారు. నగర పరిధిలో రోడ్డు ప్రమాద బాధితులకు సత్వరం బీమా అందించేందుకు కమిషనర్ ప్రత్యేక యాప్ తీసుకురావడాన్ని అభినందించారు. అంతకుముందు సింహాద్రినాథుని దర్శనానికి వచ్చిన మంత్రి అనిత కుటుంబ సభ్యులకు ఈవో వేంద్ర త్రినాథ రావు ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు వేదాశీర్వచనాలు, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. మంత్రి వెంట టీడీపీ నేతలు పాశర్ల తరుణ్‌ఆదిత్య, మజ్జి చంద్ర శ్రీనివాసరావు ఉన్నారు.


కప్పస్తంభం వద్ద మంత్రి అనిత, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ తనిఖీ

గోపాలపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులు, రౌడీషీటర్ల వివరాలపై ఆరాతీశారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. స్టేషన్‌లో సీసీ కెమెరాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదు తీసుకున్న వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి కాపీలు అందజేయాలని ఆదేశించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని సమస్యలు, ఇతర విషయాలను ఏసీపీ నరసింహమూర్తి మంత్రికి వివరించారు.

వాల్తేరు రైల్వే ఉద్యోగులకు కళ, సాహిత్య అవార్డులు


మల్ల శివ


జగన్నాథ్


విజయ్‌కుమార్

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కళ, సాహిత్య అవార్డు సాధించారు. లోకో పైలెట్‌గా పనిచేస్తూ అతి చిన్న చెస్ బోర్డు రూపొందించి గిన్నిస్ బుక్‌ఆఫ్ రికార్డు, ఐదు లక్షల పెన్ డాట్‌లతో మదర్ థెరిసా పెయింటింగ్ రూపొందించి లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించిన మల్ల శివ రూపొందించిన మరికొన్ని చిత్రాలు కోనసీమ చిత్ర కళాపరిషత్ ఆర్ట్ మ్యాగజైన్‌లో ప్రచురితమయ్యాయి. అలాగే స్టెనోగ్రాఫర్‌గా కె.ఆర్. జగన్నాథ్‌కుప్రయాణం, సంస్కృతి, సామాజిక ఆందోళన ఇతి వృత్తాలుగా రచించి సాహిత్య అనుభవజ్ఞుల ప్రశంసలు అందుకున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ తెలుగు కీర్తి అవార్డును ప్రకటించింది. ఏప్రిల్‌లో విజయవాడలో జరిగే కళావేదికపై తెలుగు కీర్తి సాహిత్య అవార్డు అందుకుంటారు. 'మూడు రాష్ట్రాలు-మూడు సంస్కృతులు' అనే అంశానికి సంబంధించి మినుములతో ప్రత్యేక చిత్రాన్ని రూపొందించిన ఎం.విజయ్‌కుమార్ కళాకృతికి ఆసియా బుక్ ఆఫ్ రికార్డు, మిరాకిల్స్ వరల్డ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రశంస పత్రాలు అందజేశాయి.

అంతర్ వర్సిటీ మహిళా క్రికెట్ టోర్నీకి ఏయూ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును సోమవారం ప్రకటించారు. ఈ నెల 27 నుంచి మైసూరు విశ్వవిద్యాలయంలో జరిగే ఈ టోర్నీలో ఏయూ జట్టుకు కె.మహంతి శ్రీ (కెప్టెన్), వై.హేమ రోషిణి (వైస్ కెప్టెన్), బి.తన్మయి, బి.హర్షిత, కె.దాత్రి, సిహెచ్.మెహర్‌లహరి, బి.నవ్య, అయేషాసింగ్, కె.హారిక, వై.పుణ్య వర్షిణి, పి.యు. హాసిని, పి.వెన్నల మోహన, ఐ.మేఘన, కె.దివ్యశ్రీ, ఎస్ఎస్ఎస్‌జి.సమీర, ఎస్ఆర్ఎస్.వైష్ణవి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా ఎస్.కవిత, హారికలు వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఏయూ వ్యాయామ విద్య, క్రీడా శాస్త్ర సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి జట్టు సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.


టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు

అర్జీలు పునరావృతమైతే అధికారులదే బాధ్యత

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- 237 వినతుల స్వీకరణ

మహారాణిపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలు పునరావృతం అయ్యాయంటే దానికి జిల్లా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ ఏంఎన్ హరేంధిర ప్రసాద్ మరోసారి హెచ్చరించారు. గతంలోనూ ఆయన పలుసార్లు ఇదే హెచ్చరిక చేయడం, అయినా అవే అర్జీలు మళ్లీ రావడంతో అసహనం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించగా 237 వినతులు అందాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్ష సమావేశంలో 165 అర్జీలు మళ్లీ రావడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తంచేశారు. అర్జీలను 24 గంటల్లో పరిశీలించి, పూర్తిస్థాయి విచారణ జరిపి పొరపాట్లకు తావులేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే అర్జీలకు అధికారులు ప్రాధాన్యత ఇచ్చి అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. తాజాగా అందిన అర్జీల్లో రెవెన్యూ 76, జీవీఎంసీ 65, పోలీసు 15, ఇతర విభాగాలకు సంబంధించి 81 వినతులున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, తదితరులు

జీతం బకాయిలు చెల్లించండి

విశాఖ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకులు తమ 5 నెలల జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కలెకరేట్‌లో జిల్లా గెస్ట్ ఫ్యాకల్టీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని అందించారు.

జీవీఎంసీలో 92 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 92 వినతులు వచ్చినట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు నేరుగా తమ సమస్యలను విన్నవించుకున్నారన్నారు. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పీ విభాగంలోని రైల్వే నిర్వహణ పనులు చేస్తున్న ఓ కాంట్రాక్టు కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. ఇస్లాంపేట ప్రాంతానికి చెందిన మహ్మద్ గౌస్ (43) ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నారు. సోమవారం ఉదయం రైల్వే నిర్వహణ పనుల్లో భాగంగా ఎయిర్ ఓపెన్ చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుని కుటుంబానికి ఇన్సూరెన్స్‌గా రూ.11 లక్షలు, కాంట్రాక్టర్ ఆర్థిక సహాయంగా రూ.5 లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు కార్మికునిగా ఉపాధి కల్పించేందుకు ఒప్పందం కుదిరింది. ఈ చర్చల్లో నాయకులు మంత్రి రవి, నమ్మి రమణ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 12 మందికి జరిమానా

పెందుర్తి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందికి రూ.1.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపిన వివరాలివి. కొంతకాలంగా పోలీసులు జరిపిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని రెండో స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు ఎదుట హాజరుపరచగా కోర్టు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించిందన్నారు.

బస్సు కింద పడి వృద్ధురాలి దుర్మరణం

ఎండాడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : బస్సు దిగుతుండగా డ్రైవర్ గమనించకుండా ముందుకు పోనీయడంతో కింద పడి వృద్ధురాలు మృతి చెందింది. సోమవారం కారు షెడ్డు వద్ద ఈ ప్రమాదం జరిగింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమిలిలోని ఎగువపేటలో నివాసం ఉంటున్న దోనీ సావిత్రి (80) తన కుమారుడు బుజ్జి, కోడలు రాజేశ్వరితో కలిసి బక్కనపాలెంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కారు. మధురవాడ కారుషెడ్డు సిగ్నల్ పాయింట్ దగ్గరకి వచ్చేసరికి రాజేశ్వరి, బుజ్జి బస్సు దిగారు. వృద్ధురాలైన సావిత్రి బస్సు దిగుతుండగా, డ్రైవర్ గమనించకుండా ముందుకు లాగించాడు. దీంతో బస్సు నుంచి జారి పడిపోగా వెనుక చక్రాలు ఆమె కాళ్ల పైనుంచి వెళ్లిపోయాయి. తీవ్ర గాయాల పాలైన సావిత్రి ప్రాణాలు విడిచింది. మృతురాలి కుమారుడు దోనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలోని కెనరా బ్యాంకు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడపైన సంస్థ కార్యాలయంలో ఈనెల 23 నుంచి మార్చి 23 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన గృహిణులు 80193 88999 నంబరులో సంప్రతించాలన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు

- ప్రతి పంచాయతీలో ఓ మోడల్ ప్రాథమిక పాఠశాల
- తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకోండి
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు

విశాఖపట్నం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమికోన్నత పాఠశాలలను పూర్తిగా రద్దు చేయనున్నామని, వాటి స్థానంలో ప్రతి పంచాయతీకి ఒక మోడల్ పాఠశాలను ఏర్పాటు చేస్తామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు తెలిపారు. విశాఖ నగరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు, విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారులు, ఉప విద్యా శాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పంచాయతీలో మోడల్ ప్రాథమిక పాఠశాలతోపాటు బేసిక్ పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు రద్దు నేపథ్యంలో అక్కడ చదువుతున్న విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. మూడు కిలోమీటర్ల దూరం దాటి ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్లే వారికి రవాణా చార్జీలు ఇస్తామన్నారు. ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల విద్యార్థులను వెనక్కి పంపిస్తామన్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. సమావేశంలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లా కలెక్టర్లు ఎంఎన్.హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, దినేష్‌కుమార్, బీఆర్ అంబేద్కర్, పాఠశాల విద్యా ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్, డీఈవోలు ప్రేమ్‌కుమార్, అప్పారావునాయుడు, బ్రహ్మాజీ, మాణిక్యాల నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

25 నుంచి చాగంటి ప్రవచనాలు

కొమ్మాది, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ రామాయణంపై ప్రముఖ ప్రవచన కర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు అందించనున్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఈనెల 25 నుంచి 42 రోజుల పాటు సాయంత్రం 6 గంటల నుంచి ప్రవచనాలుంటాయని నిర్వాహకులు అన్నంరాజు సత్యనారాయణ తెలిపారు. అష్టలక్ష్మి, వైశాఖేశ్వరస్వామి దేవాలయం, గాయత్రి విద్యాపరిషత్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు.